ఇంజనీరింగ్ సీట్ల..
లెక్క తేలింది!
18 వరకూ వెబ్ ఆప్షన్ల నమోదు 7

గోదావరిలో బోట్ షికారుకు బ్రేక్


మూత పడిన ఫ్లోటింగ్ రెస్టారెంట్

రాజమహేంద్రవరం,జూలై 13 (ఆంధ్రజ్యోతి) : అఖండ గోదావరిలో బోట్ షికారుకు బ్రేక్ పడింది. వరద పోటు వల్ల మూడు పెద్ద బోట్లు, ఒక స్పీడ్ బోట్‌ను ఆపేశారు. ఫ్లోటింగ్ రెస్టారెంట్ మూతపడింది. కొన్ని నెలల కిందట గోదావరిలో ఫ్లోటింగ్ రెస్టారెంట్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. మొదట్లో ఈ రెస్టారెంట్ ఏర్పాటు చేసినపుడు విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు మాటిచ్చారు. కానీ లంకలోకి విద్యుత్ సౌకర్యం ఇచ్చే పరిస్థితి కనిపించకలేదు. రోజుకు రూ.15వేల వరకూ డీజిల్ ఖర్చు అవుతుందని చెబుతూ రెస్టారెంట్ నిర్వాహకుడు శ్రీనివాస్ దీనిని సుమారు మూడు నెలల కిందట ఒడ్డుకు చేర్చారు. ప్రస్తుతం వరద ఎక్కువగా ఉండడంతో ఆదివారం నుంచి రెస్టారెంట్ మూసి వేశారు. సుమారు రెండు నెలల వరకూ ఇది తెరిచే అవకాశం లేదని నిర్వాహకులు చెప్పడం గమనార్హం.

భూ..కేర్ ఫుల్!



భూ పందేరానికి కూటమి ప్రభుత్వం చెక్

ఖాళీ జాగా కనబడితే చాలు.. అది ప్రభుత్వానిదా?.. ప్రైవేటుదా?..అనే విషయం అసలు పట్టించుకోరు.. ఆక్రమించేస్తారు.. రక్కున లింక్ డాక్యుమెంట్లు పుట్టిస్తారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో డబ్బుల కట్టలు విసిరి ఆ భూమిని చుట్టబెట్టేస్తారు. బాధితులు లబోదిబోమన్నా కదలరు వదలరు.. గత ప్రభుత్వంలో కబ్జా అనేది ఒక వృత్తిగా అవతరించింది. జడ్జి రామకృష్ణ భూములు ఒక వైసీపీ నాయకుడు ఆక్రమించారని గగ్గోలు పెట్టినా ఏం చేయలేని పరిస్థితి. నాడు ఇలా ఎందరో బాధితులు తమ భూములు ఆక్రమించారని పోలీస్ స్టేషన్, కోర్టు మెట్లు ఎక్కిన వారున్నారు.. అయినా లాభం లేకపోయింది.. కూటమి ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించిందో ఏమో కానీ.. భూ అక్రమాలకు చెక్ పెట్టేందుకు చర్యలు చేపట్టింది.

(ఆంధ్రజ్యోతి-రాజమహేంద్రవరం)

భూ అక్రమాలకు ప్రభుత్వం చెక్ పెట్టింది. ఇప్పటి వరకూ రిజిస్ట్రేషను రద్దు అధికారం పౌర న్యాయస్థానాలకు మాత్రమే ఉండగా.. ఇప్పుడు ఆ అధికారం కలెక్టర్‌కి దాఖలు పరుస్తూ చట్టం అమల్లోకి వచ్చింది. ఆస్తుల రిజిస్ట్రేషన్లు అక్రమంగా జరిగితే వాటిని రద్దు చేసే అధికారాన్ని కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటయ్యే కమిటీకి దాఖలు పరుస్తూ 1908 నాటి చట్టానికి సవరణలు చేస్తూ రాష్ట్ర శాసన సభ ఆమోదం తెలిపింది. శాసన సభ ఆమోదించిన సవరణ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం తెలపడంతో ప్రభు త్వం జారీ చేసిన నోటిఫికేషన్ బుధవారం నుంచి అమల్లోకి వచ్చేసింది. వాస్తవానికి భూముల క్రయ, విక్రయాల సమయంలో సబ్- రిజిస్ట్రార్లు ఆ భూమి/స్థలానికి సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలి. ఒక వేళ ప్రభుత్వానికి చెందిన లేదా నిషేధిత జాబితా (22ఏ)లో ఉన్న భూముల వివరాలను రెవెన్యూ శాఖ రిజిస్ట్రేషన్ల శాఖకు అందజేస్తుంది. ఆ జాబితాలో ఉన్న భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ రిజిస్ట్రేషను చేయడానికి వీల్లేదు. ప్రభుత్వ భూములను కాపాడడంలో కలెక్టర్‌కి ఎంత బాధ్యత ఉంటుందో.. సబ్-రిజిస్ట్రార్లకూ అంతే ఉంటుంది. అది వారి విధి కూడా. అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు రుజువైతే సబ్-రిజిస్ట్రారుకు మూడేళ్ల నుంచి ఏడేళ్ల వరకూ జైలు శిక్ష విధించే అవకాశాన్ని చట్టం కల్పిస్తోంది.కానీ చట్టాల్లో ఉన్న లొసుగులు, కోర్టుల్లో ఏళ్లకు తరబడి విచారణ నడవడం వంటి కారణాలతో వాళ్లకు భయం, బాధ్యత పోయాయి. వాస్తవానికి మోళీ తతంగానికి సబ్-రిజిస్ట్రారు కార్యాలయమే కేంద్ర బిందువుగా ఉంటుంది. చట్టాలు ఉన్నా ఇప్పటి వరకూ యథేచ్ఛగా భూ అక్రమ రిజిస్ట్రేషన్లు జరుగుతూనే ఉన్నాయి.

ఫ్రీ హోల్డ్ పేరుతో..

22(ఎ) జాబితాలో ఉన్న భూములను కబ్జాదారులు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించుకుంటూనే ఉన్నారు. వాస్తవానికి నిషేధిత భూముల జాబితా ఐజీఆర్ఎస్ వెబ్‌సైట్‌లో గ్రామాలు, సర్వేల వారీగా ఉంటుంది. కానీ దానిపై పెద్దగా అవగాహన లేక ప్రభుత్వ, ప్రైవేటు భూములను ఆక్రమణదారులు చేజిక్కించుకుంటున్నారు. 2023లో వైసీపీ ప్రభుత్వం అడిన ఫ్రీహోల్డు నాటకం భూ పందేరానికి పరాకాష్ఠగా చెప్పవచ్చు. నిషేధిత జాబితాలో ఉన్న కొన్ని భూములను, చుక్కల భూములను అప్పట్లో జాబితా నుంచి తొలగించారు. దీనినే ఫ్రీహోల్డు అంటారు. దీంతో వీటికి రిజిస్ట్రేషను చేయించుకొనే వెసులుబాటు కలిగింది. అంతే.. వైసీపీ నాయకులు రంగంలోకి దిగారు. ఉమ్మడి తూర్పు గోదావరిలో వందలాది ఎకరాలు చుట్టబెట్టేశారు. ఎంతలా అంటే అటు రెవెన్యూ, ఇటు రిజిస్ట్రేషన్ల అధికారుల లెక్కలకు పొంతన కుదరనంతగా నొక్కేశారు. ఉదాహరణకు తూర్పు గోదావరి జిల్లాలో 5120 ఎకరాలను ఫ్రీహోల్డు చేశారు. వీటిలో 47 లావాదేవీల ద్వారా 41.866 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు జరిగాయని జిల్లా రిజిస్ట్రారు కార్యాలయ రికార్డులు చెబుతుంటే.. 100 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు జరిగాయని కలెక్టరేట్ అధికారులు వెల్లడిస్తున్నారు. ఇప్పుడు కొత్తగా వచ్చిన చట్టంతో ఫ్రీహోల్డును సెట్‌చేసే పనిని కూడా ప్రభుత్వం మొదలు పెట్టనుంది.

కొత్త చట్టం ఏం చెబుతుందంటే..

కొత్తగా వచ్చిన చట్టంతో ప్రతి జిల్లాలో ఒక కమిటీ ఏర్పడుతుంది. జిల్లా కలెక్టరు చైర్మన్‌గా ఉంటే, రిజిస్ట్రేషన్ల శాఖ, రెవెన్యూ తదితర శా ఖల నుంచి ఇతర సభ్యులు ఉంటారు. అక్ర మంగా రిజిస్ట్రేషను జరిగిందని కలెక్టర్‌కి పిర్యాదు అందిన తర్వాత కమిటీ రంగంలోకి దిగుతుంది. రిజిస్ట్రేషను అక్రమమని తేలితే రద్దు చేస్తారు. ఇప్పటి వరకూ ఈ అధికారం క్రయ విక్రయదారులిద్దరూ కలిపి లేదా సివిల్ కోర్టుల చేతుల్లోనే ఉండేది. కొత్తగా వచ్చిన చట్టంతో ఖర్చు, సమయం కూడా ఆదా అవు తుందని చెబుతున్నారు. విధి విధానాలు తమకు ఇంకా రాలేదని తూర్పు గోదావరి జిల్లా రిజిస్ట్రారు సత్యనారాయణ తెలిపారు.

- భూ అక్రమాలకు చెల్లు
- కలెక్టర్ చేతిలో పాశుపతాస్త్రం
- కొత్త చట్టంతో రద్దుకు అవకాశం
- 1908 నాటి చట్టానికి సవరణ
- అసెంబ్లీలో ఆమోదించిన సర్కార్
- కోర్టుకెళ్లకుండానే పరిష్కారం
- భూ బాధితులకు శుభవార్త
- కబ్జాదారులకు చేదువార్త
- నాటి అక్రమాలతో మేలుకొలుపు

ప్లాస్టిక్ నిషేధం ఉల్లంఘిస్తే ట్రేడ్ లైసెన్స్ రద్దు : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 13(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై ఉన్న నిషేదాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్, కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి తెలిపారు. ప్లాస్టిక్ నిషేధాన్ని ఇకపై నగరంలో కఠినంగా అమలు పరుస్తామన్నారు.75 మైక్రాన్స్ లోపు ఉండే ప్లాస్టిక్ కవర్లతో పాటు ప్లాస్టిక్ ప్లేట్లు,కప్పులు, ప్లాస్టిక్ గ్లాసులు,ఫోర్క్‌లు, స్ట్రాలు,స్వీట్ బాక్సులు ప్యాకింగ్‌కు వాడే పల్చటి ప్లాస్టిక్, ఇయర్ బడ్స్, బెలూన్లకు వాడే ప్లాస్టిక్ స్టిక్స్, ప్లాస్టిక్ జెండాలు, అలంకరణకువాడే దర్మాకోల్ తదితర వస్తువులపై నిషేదం ఉందన్నారు.వీటిని వినియోగిస్తే చర్యలు తప్పవన్నారు. ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి.. ప్రజల ఆరోగ్య సమస్యలకు కారణభూతమవుతుందన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేదించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే వ్యాపారుల ట్రేడ్ లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.



సూర్యఘర్..స్లో!

- జిల్లాలో 10,867 దరఖాస్తులు
- ఫీజు చెల్లించినవి 2900
- 1723 ఇళ్లకే సోలార్
- పథకం నిర్వహణ గాలికి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఈ పథకంపై అవగాహన కల్పించకపోవడంతో పెద్దగా స్పందన కనిపించడంలేదు.జిల్లాలో సూర్యఘర్ పథకా నికి 10,867మంది దరఖాస్తు చేస్తున్నారు.కానీ ఇంత వరకూ అప్లికేషన్ ఫీజ్ కట్టినవారు 2900 మంది మాత్రమే. అందులో ఇళ్లకు సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసుకున్నవారు 1723 మంది మాత్రమే. ఇక్కడ సోలార్ సామర్థ్యం మొత్తం 1.186 మెగావాట్లు. వీటిని వేగవంతం చేసే బాధ్యత విద్యుత్ శాఖకు ఉంది. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చొరవతీసుకుని డీఆర్‌డీఏ, మెప్మాలకు బాధ్యత అప్పగిం చా రు. ఈ శాఖల్లో గ్రామాలు, పట్టణాలకు చెందిన సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులు ఉంటాయి. వారిని మోటివేట్ చేసి వారి ఇళ్లను సూర్యఘర్లుగా మార్చడానికి ప్రయత్నించారు.ఈ గ్రూపుల్లో లక్షల మంది మహిళలు ఉంటారు.అయితే ఇంత వరకూ డీఆర్‌డీఏ నుంచి సుమారు 250 మంది, మెప్మా నుంచి సుమారు 90 మంది వరకూ ముందుకు వచ్చినట్టు చెబుతున్నారు.

ఈ పథకం పొందాలంటే...

ఈ పథకానికి అందరూ అర్హులే. డాబా మీద కనీసం 100 చదరపు అడుగుల స్థలం ఉంటే సరిపోతుంది.అక్కడ ఒక కిలోవాట్ సోలార్ ద్వారా కిలోవాట్ సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చు. దానికి రూ.70వేలు ఖర్చు అవుతుంది.అందులో రూ.30 వేలు ప్రభుత్వం భరిస్తుంది.కానీ లబ్ధిదారుడు ముందుగా రూ.70 వేలు చెల్లిస్తే తర్వాత రాయితీ రూ.30 వేలు ఇస్తుంది.అన్ని వర్గాలకు ఈ పథకం వర్తిస్తుంది. కిలోవాట్లను బట్టి చెల్లించాల్సిన సొమ్ము కొద్దిగా పెరుగుతుంది. సోలార్ ఇన్‌స్టాల్ చేయడానికి జిల్లాలో 500 మంది వెండర్లు ఉన్నారు.బీసీలు ఎవరైనా ముందుకు వచ్చిన సూర్యఘర్‌గా తమ ఇంటిని మార్చుకోవాలంటే ప్రస్తుతం ఇచ్చే రాయితీతో పాటు మరో రూ.20 వేలు రాయితీ కూడా ఇవ్వనున్నారు. ఎస్సీలకు ఇంకా రాయితీకి గురించి ప్రకటించలేదు.కానీ పూర్తిగా ఉచితంగా ఇస్తారనే ప్రచారం జరుగుతోంది.

సన్..డే!

రాజమహేంద్రవరం సిటీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): వానాకాలం వచ్చినా భానుడి ప్రతాపం మాత్రం తగ్గడంలేదు. గత వారం రోజులుగా వరుణుడు ముఖం చాటేయడంతో భానుడు మండిపడుతున్నాడు.. ఆదివారం వచ్చిందంటే రాజమహేంద్రవరం పార్కులు, పుష్కరాలరేవు, కంబాలపార్కు, జీఎస్‌టీ రోడు తదితర సెంటర్లు ప్రజలతో కళకళలాడేవి.కానీ ఈ ఆదివారం మాత్రం ఎండదెబ్బకు ఉదయం 9 గంటలకే మార్కెట్ పనులు ముగించుకుని ప్రజలు ఇళ్లల్లోకి వెళ్లిపోయారు.ఎండవేడిమికి నగరంలో గోకవరం బస్టాండ్ రోడ్డు, కోరుకొండ రోడ్డు, కంబాలచెరువు రోడ్డు, వైజంక్షన్ రోడ్డు నిర్మానుష్యంగా మారాయి. అడపాదడపా బయటకు వచ్చిన వారు మాత్రం గొడుగులు ,టోపీలు, ముసుగులు వేసుకున్నారు. నగరంలో ఆదివారం గరిష్ఠ ఉష్ణోగ్రత 37 డిగ్రీలుగా నమోదైంది. ఈ నెలలో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత. మరొక రెండురోజులు ఎండలు కాసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.


నిర్మానుష్యంగా రాజమహేంద్రవరం గోదావరి బండ్ రోడ్


గోదాట్లో శివయ్య


కాసేపటికే ఇలా..

హరి పాదాన పుట్టానంటే.. గోదారమ్మ

గోదావరి ఉధృతంగా ఉంది.. ఎగువ ప్రాంతాల్లో తగ్గుముఖం పట్టడంతో వరదంతా ఉరుకున పరుగున వచ్చిపడుతోంది.. గట్లను తాకుతూ.. లంకలను ముంచుతూ పరుగులు పెడుతోంది. 6.56 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. గోదావరి ఉధృతికి కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని ఈ చిత్రమే ఉదాహరణ.. మొదటి ఫొటోలో శివలింగం గోదావరిలో నానుతూ కనిపించింది.. పది నిమిషాల వ్యవధిలోనే శివయ్యను గోదారమ్మ ముంచెత్తిన దృశ్యం రెండో చిత్రంలో చూడవచ్చు.. ఆదివారం గోదావరి ఉధృతి ఇంతలా ఉంది.. మరికొంత వరద పెరిగితే గోష్పాదక్షేత్రం నీటమునుగుతుంది. ఈ ఏడాది ఇంత ఉధృతంగా రావడం ఇదే తొలిసారి.. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. అయితే సాయంత్రానికి గోదావరి తగ్గుముఖం పట్టడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు..

మన కోటావోడు.. ఇక లేడా!


నటుడు జిత్‌మోహన మిత్రతో కోట (ఫైల్)

గోదారోళ్లతో ఎంతో అనుబంధం

నాకేంటి.. నాకేంటి!.. అంటూ అహ నా పెళ్లంటలో పిసినారి క్యారెక్టర్‌లో కడుపుబ్బా నవ్వించినా.. వీడెవండి బాబూ అంటూ పవిత్ర బంధం సినిమాలో వెంకటేష్ తండ్రిగా ఆకట్టుకున్నా.. శత్రువు..గణేష్ సినిమాల్లో విలన్ పాత్రల్లో రాణించినా.. గోదారోళ్ల యాస భాషలే ఆయన నటనకు కంచుకోట.. పాత్ర ఏదైనా గోదారోళ్ల డైలాగ్‌లతో ఆకట్టుకునేవారు.. అందుకే ఒకానొక టైమ్‌లో మన కోటావోడు.. ఉన్నాడంట్రా సినిమా కెళదాం అనేస్థాయికి అభిమానుల గుండెల్లో కోట కట్టుకున్నారు.. అయితే ఆదివారం ఆయన మృతిచెందడంతో.. ఇక లేరనే చేదునిజాన్ని తట్టుకోలేక అభిమానులు కన్నీటిపర్యంతమయ్యారు.

- తొలి సినిమా ప్రాణం ఖరీదు
- కోనసీమలోనే చిత్రీకరణ
- కన్నీళ్లు పెట్టుకున్న అభిమానులు

అమలాపురం రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): క్రూరమైన విలనిజమైనా, కడుపుబ్బ నవ్విం చే హాస్యరసమైనా, కన్నీళ్లు పెట్టించే సెంటిమెంటు సీనైనా.. ఏదైనా అవలీలగా చేసేసి.. సీన్‌ను పండించగల అతి అరుదైన ఆర్టిస్టు కోట శ్రీనివాసరావు.. గోదావరి జిల్లా వాళ్లకు మాత్రం ఎప్పటికీ కోటావోడు..హాస్యాన్ని కొత్త పుంతలు తొక్కించడంతో పాటు తన సహజశైలి నటనతో, వాక్ చాతుర్యంతో చలనచిత్రసీమలో ప్రత్యేక స్థానం సాధించారు. సహజ నటుడిగా పేరొందిన కోట శ్రీనివాసరావుకు కోనసీమతో ఎంతో అనుబంధం ఉంది. 1978లో విడుదలైన ప్రాణం ఖరీదు చిత్రంలో తొలిసారిగా కోట శ్రీనివాసరావు నటించారు.ఆ చిత్రం షూటింగ్ సఖినేటిపల్లి మండలం గుడిమూల పరిసర ప్రాంతాల్లోనే జరిగింది. సినిమాల్లో నటిస్తూనే బ్యాంకు ఉద్యోగిగా కొనసాగారు. 1987లో కోటశ్రీనివాసరావు సమనసలోని స్టేట్ బ్యాంకులో పని చేశారు. నాటి గ్రామ సర్పంచ్ మామిళ్లపల్లి రాజారావు నడుపుతున్న అన్నపూర్ణ టాకీస్‌ను సందర్శించారు. టాకీస్ వద్ద శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. చిత్రమేమిటంటే ఆ సమయంలో అన్నపూర్ణ టాకీస్‌లో లేడీ సూపర్ స్టార్ విజయశాంతి నటించిన ప్రతిఘటన చిత్రం ఆడుతోంది. ఆ సినిమాలో కోట శ్రీనివాసరావు నటించారు. కోట శ్రీనివాసరావు మృతిచెందారన్న సమాచారం ఎంతో కలచివేసిందని నాటి సర్పంచ్ మామిళ్లపల్లి రాజారావు అన్నారు.

ఎన్నో మరుపురాని పాత్రలు

తర్వాత జంధ్యాల దర్శకత్వంలో వచ్చిన అహ నా పెళ్లంటలో కోట శ్రీనివాసరావు లక్ష్మీపతి అనే విలక్షణమైన పాత్రల్లో నటించారు. పిసినారి తండ్రిగా ఆయన చేసిన పాత్ర ఎంతో మెప్పించింది. గోదావరి జిల్లాలోనే ఈ చిత్ర ం షూటింగ్ జరగ్గా ఈ పాత్రలో కోడిని కట్టేసి సగం పగిలిన కళ్ల అద్దాలతో ఉత్తి అన్నం తింటూ చికెన్ తిన్నట్టుగా ఫీలయ్యే సీన్‌ను ఇప్పటికీ మీమ్స్‌లో వైరల్ చేస్తుంటారు. కోటా నటించిన మరో మరుపురాని చిత్రం వంశీ దర్శకత్వంలో వచ్చిన శ్రీ కనకమహాలక్ష్మి రికార్డింగ్ డ్యాన్స్ ట్రూప్.. ఇందులో ఏళ్ల పాపారావుగా ఆయన పండించిన హాస్యం అద్భుతం.. రాజమహేంద్రవం, కోనసీమల్లో ఈ చిత్ర షూటింగ్ జరగ్గా.. గోదావరి యాసలో కోటా పలికిన డైలాగులు మరో స్థాయిలో ఉంటాయి. జంధ్యాల దర్శకత్వంలో వచ్చిన చూపులు కలిసిన శుభవేళ చిత్రంలో గుర్నాథం పాత్ర కోటకు మరో ఆణిముత్యం లాంటిది.తెలుగు భాషను ప్రేమించే జమిందారుగా..ఆయన గ్రాంధిక భాషలో మాట్లాడుతూ పండించిన హాస్యం భలే ఉంటుంది. 'ఉత్తరపురుషుడు', 'నిశివర్లోష్టోదకము' 'ఉష్ణగ్రాహకఘటం', 'అశ్వము అధిరోహించుట', 'చతుష్చక్ర శకట నివాస స్థానము' అనే పదాలు.. ఆయన నోటి వెంట ఆరోగ్యకరమైన హాస్యాన్ని పండించాయి. తర్వాత కోనసీమ పరిసరాల్లో తీసిన ఖైదీనెంబరు 786లో ఆయన సూర్యచంద్రరావు పాత్రలో మెప్పించారు. యమలీలలో ఇన్‌స్పెక్టర్ రంజిత్, హలోబ్రదర్‌లో తాడిమట్ట య్యవినోదంలో బంగారం సహా ఇంకా అనేక చిత్రాల్లో నటించి ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. 1992లో విడుదలైన భలే ఖైదీలు చిత్రం కాకినాడ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకుంది. కీలక సన్నివేశాల చిత్రీకరణలో కాకినాడలోని ప్రైవేటు బస్సులో షూటింగ్ నిర్వహించారు. ఈ చిత్రంలో అమలాపురం రూరల్ మండలం సవరప్పాలెం గ్రామానికి చెందిన సత్తి శ్రీరామప్రసాద్ ఆర్టీసీ కండక్టర్‌గా నటించారు. కోట శ్రీనివాసరావు మృతిచెందారన్న వార్త తనను ఎంతగానో కలచివేసిందని శ్రీరామప్రసాద్ నాటి షూటింగ్ సంఘటనలను గుర్తు చేసుకున్నారు.ఇక అమలాపురం ఎస్కేబీఆర్ కళాశాల అధ్యాపకుడిగా పనిచేస్తున్న ప్రముఖ రచయిత దువ్వూరి సుబ్రహ్మణ్యశర్మ పలు పర్యాయాలు కోట శ్రీనివాసరావును కలిశారు.ఆయనతో అనుబంధాన్ని సుబ్రహ్మణ్యశర్మ వివరించారు. కోట శ్రీనివాసరావు మృతికి ఎంపీ పురం దేశ్వరి సంతాపం తెలిపారు.



అనపర్తిలో 'కోట' ఎన్నికల ప్రచారం

అనపర్తి, జూలై 13(ఆంధ్రజ్యోతి): కోట శ్రీనివాసరావు మరణం తీరని లోటని బీజేపీ నాయకుడు కొవ్వూరి సత్యనారాయణరెడ్డి అన్నారు. కోటతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.1998లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి తరపున ప్రచారం చేసేందుకు అనపర్తి వచ్చిన ఆయనతో ముచ్చటించే అవకాశం కలిగిందన్నారు. అనపర్తి జీబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన బి.రత్నారెడ్డి..1966లో ఏలూరులోని సీఆర్‌రెడ్డి కళాశాలలో కోట శ్రీనివాసరావుతో కలిసి డిగ్రీ (బీఎస్సీ) పూర్తి చేశారు.

'కోటా'భిమానులు..

దేవీపట్నం/రాజమహేంద్రవరం కల్చరల్/నిడదవోలు, జూలై 13(ఆంధ్రజ్యోతి): ముద్దుల ప్రియుడు చిత్రం దేవీపట్నం ఉమాచోడేశ్వర స్వామి ఆలయంలో షూటింగ్ చేశారు. ఈ సినిమాలో కోట శ్రీనివాసరావు కొబ్బరికాయల సుబ్బయ్య పాత్రలో నటించారు. సినీనటుడు కోట శ్రీనివాసరావుతో తమకు గల అనుబంధాన్ని రాజమహేంద్రవరానికి చెందిన నటుడు, గాయకుడు జిత్‌మోహన్ మిత్ర పంచుకున్నారు. సుమారు 50 సినిమాల్లో ఆయనతో కలిసి నటించినట్టు చెప్పారు. కోట శ్రీనివాసరావుతో తాను తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం గాడాల గ్రామం, రాజమహేంద్రవరం సిటీ పరిధిలోని మోరంపూడిలో జరిగిన సినిమా షూటింగుల్లో పాల్గొన్నట్టు తెలిపారు. నిడదవోలు పరిసర ప్రాంతాల్లో 1996 సంవత్సరం తాళి సినిమా చిత్రీకరణ సమయంలో సినీనటుడు కోట శ్రీనివాసరావు నిడదవోలు పట్టణంలోని సుంకవల్లి గణేశ్వరరావు నివాసంలో విడిది చేశారు. ఆ సమయంలో గణేశ్వరరావు కుమారుడు సుంకవల్లి శ్రీధర్ వారితో ఫొటో దిగారు. ఆయన మృతితో గోదావరి జిల్లాల్లో అభిమానులు జ్ఞాపకాల నెమరు వేసుకుని కన్నీటిపర్యంతమవుతున్నారు.

వందనాలమ్మా!

ఆషాఢమాసం సందర్భంగా జిల్లాలో అమ్మవార్లకు సారె సమర్పించడం ఆనవాయితీ.. దీనిని ప్రస్తుతం కొనసాగిస్తున్నారు. వందలాది రకాలు అమ్మవారికి సారెగా తీసుకెళుతున్నారు. ఈ చిత్రంలో చూశారా.. బిక్కవోలు మండలం జువ్వలదొడ్డిలో ఉన్న సత్తెమ్మ తల్లికి ఆదివారం భక్తులు ఆషాఢమాసం సందర్భంగా సారె సమర్పించుకున్నారు. వంద రకాల స్వీట్లను అమ్మ వారికి అందజేశారు. ముందుగా భక్తులు స్వీట్లతో గ్రామోత్సవం చేశారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి సమర్పించారు. - **బిక్కవోలు**





గోదావరి ప్రవాహం



ధవళేశ్వరం బ్యారేజ్ గేట్ల నుంచి దిగువకు ప్రవహిస్తున్న వరద నీరు

పెరుగుతూ.. తగ్గుతూ...



కాటన్ బ్యారేజ్ వద్ద గోదావరి ప్రవాహం

అత్యధికంగా 6,56,341 క్యూసెక్కులు సముద్రంలోకి...



ధవళేశ్వరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద పెరుగుతూ ప్రవహించిన గోదావరి ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిలకడగా కొనసాగి ఆపై తగ్గుముఖం పట్టింది. ఆదివారం ఉదయానికి అత్యధికంగా 6,56,341క్యూసెక్కులు కాటన్ బ్యారేజ్ గేట్ల ద్వారా దిగువకు ప్రవహించింది. ఈ సమయంలో ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదైంది. మధ్యాహ్నం వరకు నిలకడగా కొనసాగిన ప్రవాహం ఆపై తగ్గుముఖం పట్టి సాయంత్రానికి 40 వేల క్యూసెక్కులకు పైగా తగ్గి 6,14,762 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. ఎగువున భద్రాచలం వద్ద 24గంటల వ్యవధిలో 10 అడు గుల మేర తగ్గిన నీటి మట్టం ఆదివారం సాయంత్రానికి 30.60 అడుగులకు చేరుకుంది. కాటన్ బ్యారేజ్ నుంచి వ్యవసాయ అవసరాల కోసం తూర్పుడెల్టాకు 4,800క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2600 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 6800 క్యూసెక్కులు చొప్పున నీరు విడుదల చేస్తున్నారు.



కూనవరం-వీఆర్‌పురం మండలాల మధ్య ఉన్న బ్రిడ్జి దగ్గర శబరి, గోదావరి ప్రవాహం

కూనవరంలో 3 అడుగులకు..

కూనవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా కూనవరం మండలంలో శబరి, గోదావరి నదులు తగ్గుముఖం పట్టింది. ఈ ప్రాంతంలో వరద 35 అడుగులకు చేరుకుంది. ఆదివారం తెల్లవారుజాము నుంచి వరద తగ్గుముఖం పట్టింది. కూనవరంలో ఆదివారం రాత్రి 7 గంటలకు 3 అడుగులకు వరద ప్రవాహం చేరుకుంది.



రాజమహేంద్రవరం పుష్కర ఘాట్ వద్ద నీటి ప్రవాహం

గోష్పాదక్షేత్రంలో శివలింగాలను ముంచెత్తిన వరద

కొవ్వూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఎగువ రాష్ట్రాల్లో వర్షాలకు తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో అఖండ గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుంది. భద్రాచలం వద్ద 41.3అడుగులకు చేరుకుని తగ్గుముఖం పట్టడంతో దిగువన కొవ్వూరు పరిసర ప్రాంతాల్లో గోదావరి నీటిమట్టం పెరుగుతుంది. దీంతో గోష్పాదక్షేత్రంలో స్నానఘట్టాల్లో ఏర్పాటు చేసిన శివలింగాలను వరద ముంచెత్తింది.

ఇంజనీరింగ్ సీట్ల లెక్క తేలింది..

- జేఎన్టీయూకే పరిధిలో సీట్లు ఖరారు
- 2025-26 విద్యాసంవత్సరానికి 106 కళాశాలలకు గుర్తింపు
- నూతనంగా రెండు ఇంజనీరింగ్ కళాశాలలు
- ఇంజనీరింగ్‌లో సుమారు 30వేల సీట్లకు అనుమతి
- 18 వరకూ వెబ్ ఆప్షన్ల నమోదు

జేఎన్టీయూకే, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు ఎప్పుడు జరుగుతాయని ఎదురుచూస్తున్న విద్యార్థులకు కళాశాలల్లో ప్రవేశాలకు లైన్ క్లియర్ కానుంది. ఏపీఈఏపీసెట్‌కు సంబంధించిన వెబ్ కౌన్సెలింగ్ ఈనెల 7న ప్రారంభమైంది 16 వరకూ ఆన్‌లైన రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, 17 వరకూ ఆన్‌లైన్‌లో ధ్రువపత్రాల పరిశీలన కొనసాగనుంది. వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఈనెల 18 వరకూ కొనసాగనుంది. రాష్ట్రంలో ఉన్న విశ్వవిద్యాలయాల నుంచి ఇంజనీరింగ్ సీట్ల సంఖ్యపై ఉన్నత విద్యామండలికి నివేదిస్తేనే అక్కడ నుంచి కౌన్సెలింగ్‌కు సంబంధించిన నోటిఫికేషన్ వస్తుంది. రాష్ట్రంలోని అత్యధిక కళాశాలలకు అనుసంధానంతో పాటూ సాంకేతిక వర్శిటీల్లో రాష్ట్రంలో కీలకంగా ఉన్న జేఎన్టీయూకే ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి నివేదికను పంపించారు. ప్రస్తుతం ఉమ్మడి తూర్పు, పశ్చిమ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ఇంజనీరింగ్ కళాశాలలు విశ్వవిద్యాలయానికి అనుభందంగా ఉన్నాయి.

106 కళాశాలలకు గుర్తింపు

2025-26 విద్యాసంవత్సరానికి జేఎన్టీయూకే ఉన్నత విద్యామండలికి సీట్ల కేటాయింపు కోసం నివేదించింది. వర్శిటీకి అనుబంధంగా ఉన్న 106 కళాశాలల్లో ఇంజనీరింగ్‌లో సుమారుగా 30వేల సీట్లు భర్తీ చేసుకోవడానికి అనుమతి ఇచ్చారు. అయితే గతేడాది మాదిరిగానే ఈ విద్యాసంవత్సరం కూడా విద్యార్థులు సీఎస్ఈ, ఏఐ వైపు మొగ్గుచూపుతున్నారు.

ఆన్‌లైన్‌లో కళాశాలల తనిఖీ

ఏపీఎస్సీహెచ్ఈ ఆదేశాల మేరకు వర్శిటీ అనుబంధ కళాశాలల తనిఖీలు ఆన్‌లైన్‌లో చేపట్టారు. కళాశాలలోని వసతులు, స్థితిగతులు, మౌలిక సదుపాయాల పర్యవేక్షణ, విద్యార్థి- అధ్యాపకుల నిష్పత్తి, ఆట స్థలం, కళాశాల క్యాంపస్ పరిస్థితి, గ్రంథాలయ సదుపాయం, ల్యాబ్‌లు తదితర అంశాలను నిజనిర్ధారణ కమిటీ (ఎఫ్ఎఫ్‌సీ) పర్యవేక్షణ చేస్తుంది. ఈ కమిటీ సిఫార్సు మేరకు ఏఏ కళాశాలలకు ఎన్ని సీట్లు కేటాయించాలి అనే అంశంపై చర్చించి నిర్ణయం తీసుకుంటారు. అంతేకాకుండా ఏఐసీటీఈ నుంచి అనుమతి తెచ్చుకున్న ఇంజనీరింగ్ కళాశాలలకు ఎన్నిసీట్లకు యూనివర్శిటీ అనబంధ గుర్తింపు ఇస్తుందనే అంశానికి ఎఫ్ఎఫ్‌సీ సిఫార్సులే కీలకం. అయితే ఈ కమిటీలో వర్శిటీకి చెందిన ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు సభ్యులుగా ఉంటారు. ఏపీఈఏపీసెట్ వెబ్ ఆప్షన్లపై సందిగ్ధత వీడింది.

జేఎన్టీయూకే పరిధిలో 164 కళాశాలలుండగా వాటిలో 106 ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్లను భర్తీ చేయనున్నారు. 4 కళాశాలలు డీమ్డ్ యూనివర్శిటీలుగా, 8 కళాశాలలు జీరో ప్రవేశాల కారణంగా, రెండు కళాశాలలు మెర్జ్ కాగా మరొక కళాశాలను మూసివేశారు. 34 ఫార్మసీ కళాశాలలు, 9 ఎంబీఏ, ఎంసీఏ మేనేజ్‌మెంట్ కళాశాలలున్నాయి. అయితే ఈ ఏడాది రెండు నూతన ఇంజనీరింగ్ కళాశాలలు అనుమతి పొందాయి.

ఉన్నత ప్రమాణాలున్న కళాశాలలకే గుర్తింపు



ఏపీ ఉన్నత విద్యామండలి రాష్ట్రంలో ఉన్న అన్ని యూనివర్శిటీలు, ఇంజనీరింగ్ కళాశాలల ప్రమాణాలను ఆన్‌లైన్ ద్వారా పరిశీలన చేసి అనుమతి ఇవ్వాలని సూచించింది. వాటి ప్రకారం కాకినాడ జేఎన్టీయూ నుంచి ఆన్‌లైన్‌లో పరిశీలన నిర్వహించాం. సాంకేతిక విద్యలో ఉన్నతప్రమాణాలు పాటించిన అన్ని వసతులు ఉన్న కళాశాలలకే గుర్తింపు నిచ్చాం. ఆ విధమైన కళాశాలల్లో అభ్యసిస్తే విద్యార్థులకు ఎక్కువ ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

జేఎన్టీయూకే ఉపకులపతి,
ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్

శాకంబరిగా తలుపులమ్మ



శాకంబరి దేవిగా తలుపులమ్మ



క్యూలో బారులుతీరిన భక్తులు

తుని రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో ఆషాఢమాస మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం అమ్మవారు శాకంబరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేలాది మంది భక్తులు ప్రత్యేక క్యూలలో బారులుతీరి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం ఏర్పాటు చేసిన వసతి గదుల్లో వంటా వార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో విశ్వనాధరాజు ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆదివారం వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.17.3 లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో తెలిపారు.

లోవ క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

రూ.17.3 లక్షలు ఆదాయం

ఆలయానికి విరాళం

లోవ దేవస్థానంలో ఆలయ పునఃనిర్మాణానికి భక్తులు విరివిగా విరాళాలు అందజేస్తున్నారు. పిట్లపాలెం గ్రామానికి చెందిన దాసరి నాగేశ్వరరావు, బుల్లమ్మ దంపతుల కుమారుడు సాయి నాయుడు రూ.లక్షా116 విరాళం అందజేశారు. అనంతరం వారికి ఆలయ పండితులు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు.

1.10 లక్షల సత్యదేవుడి ప్రసాదం ప్యాకెట్ల విక్రయాలు

రూ.22 లక్షల ఆదాయం

అన్నవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తలుపులమ్మ లోవ నుంచి తిరుగు ప్రయాణంలో స్వస్థలాలకు వెళ్లే భక్తులు అన్నవరం సత్యదేవుడి ప్రసాదానికి బారులు తీరారు. ఆదివారం కొండపైన, కొండదిగువున ఉన్న ప్రత్యేక కౌంటర్ల ద్వారా 1.10 లక్షల ప్యాకెట్లు విక్రయించగా రూ.22 లక్షల ఆదాయం లభించినట్టు అధికారులు తెలిపారు.

భీమేశ్వరాలయంలో శాకంబరి ఉత్సవం



శాకంబరిగా దర్శనమిస్తున్న మాణిక్యాంబ, శోభాయాత్రలో పాల్గొన్న మంత్రి సుభాష్

ద్రాక్షారామ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో అష్టాదశశక్తి పీఠం మాణిక్యాంబ అమ్మవారు ఆదివారం శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆలయంలో శాకంబరి ఉత్సవం ఘనంగా జరిగింది. ఉదయం రామచంద్రపురం మండలం వేగాయమ్మపేట ఆస్థాన మండపం నుంచి దేవస్థానం ఆధ్వర్యంలో పసుపు, కుంకుమ, చీర, సారె మంగళవాయిద్యాలతో శోభాయాత్ర ప్రారంభించారు. ఆలయ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవానీ, ఆలయ అర్చకులు, సిబ్బంది, సేవా భక్తులు, 150 కిలోల సారె సమర్పించిన కంచర్ల చక్రి, సారె సమర్పించిన ఇతర భక్తులు పాల్గొన్నారు. అన్నాయిపేట వద్ద మంత్రి సుభాష్ హాజయ్యారు. అనంతరం ఆలయానికి చేరుకుని ప్రదక్షిణలు చేసి మాణిక్యాంబకు చీర,సారె సమర్పించారు. కార్యక్రమంలో వాడ్రేవు సుందర రత్నాకరరావు, సత్యంవాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు. అనంతరం భీమేశ్వరస్వామి దేవస్థానం తరఫున వెలంపాలెంలో గోగులమ్మవారికి సారె సమర్పించారు.

సీజ్ చేసిన బోటు దొంగతనం

కేసు నమోదు చేసిన కొవ్వూరు పోలీసులు

కొవ్వూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సీజ్ చేసిన మెకనైజ్డ్ డ్రెజ్జింగ్ బోటు దొంగతనంపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పట్టణంలో గత నెల జూన్ 2న అఖండ గోదావరి కుడిగట్టు విభాగం ఏఈ జి. మణికంఠరాజు, రెవెన్యూ, జిల్లా టాస్క్‌ఫోర్సు బృందంతో కలిసి ఇసుక ర్యాంపులు తనిఖీ నిర్వమించారు. దండకుంట పుంత ఇసుకర్యాంపు-2లో అనధికారికంగా ఇసుక తవ్వకాలు చేస్తున్న 2 మెకనైజ్డ్ డ్రెజింగ్ బోట్లు వెరోనికా శ్రీలోహితాక్ష, పేరు తెలియని బోటును సీజ్ చేసి అధికారుల కస్టడీలో ఉంచారు. ఈనెల 11న వెరోనికా శ్రీలోహితాక్ష డ్రెజ్జింగ్ బోటు కనిపించకపోవడంతో పల్నాడు జిల్లా అమరావతి మండలం ధరణికోటకు చెందిన బుడ్డి రవికుమార్, కృష్ణాజిల్లా గొల్లపూడికి చెందిన పీత వెంకట రామారాజు బోటును దొంగతనం చేశారని ఏజీఆర్‌బీ ఏఈ జి.మణికంఠరాజు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు సీఐ విశ్వం తెలిపారు.

మామపై అల్లుడు కత్తితో దాడి

కరప, జూలై 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరపలో ఆదివారం మధ్యాహ్నం వరుసకు మామ అయిన వ్యక్తిపై అల్లుడు కత్తితో దాడి చేసి గాయపర్చాడు. పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కరప గ్రామానికి చెందిన భేరి చంద్రశేఖర్‌కు అతడి చిన్నాన్న భేరి రామకృష్ణకు మధ్య గత కొన్నేళ్లుగా ఆస్తి తగాదాలు ఉన్నాయి. రామకృష్ణ కుమారుడు వృత్తిరీత్యా కుటుంబంతో సహా తునిలో ఉంటున్నాడు. అతడి మావయ్య బిక్కవోలుకి చెందిన అముజాల వీరరాఘవ ఆదివారం మధ్యాహ్నం భోజనం క్యారేజ్ పట్టుకుని కరపలో ఉన్న వియ్యంకుడు రామకృష్ణ ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో ఆస్తి విషయమై ఇరువర్గాల మధ్య మరోసారి రచ్చ జరిగింది. ఈ క్రమంలో చంద్రశేఖర్, అతడి తల్లి రాజరాజేశ్వరి, వియ్యంకుళ్లు రామకృష్ణ, వీరరాఘవలు పరస్పరం వాగ్వాదం చేసుకోవడంతో ఘర్షణ జరిగింది. ఆవేశం పట్టలేని చంద్రశేఖర్ కత్తితో వీరరాఘవపై దాడి చేసి ఎడమచేతిపై రెండు చోట్ల నరకడంతో తీవ్ర రక్తస్రావమైంది. స్థానికులు స్పందించి బాధితుడిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కరప ఎస్ఐ తోట సునీత హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

కాకినాడ జీజీహెచ్‌లో విద్యార్థినులపై లైంగిక వేధింపులు..

నలుగురు నిందితులకు పోక్సో కేసులో రిమాండ్

రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌కి తరలింపు

జీజీహెచ్ (కాకినాడ), జూలై 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన రోగ నిర్ధారణ ల్యాబ్‌లకు చెందిన ఉద్యోగులకు రెండు సెక్షన్‌లలో బెయిల్ వచ్చినా మైనర్ బాలికలపై వేధింపులకు గురిచేసిన పోక్సో కేసులో మాత్రం నాన్ బెయిలబుల్ సెక్షన్ కావడంతో బెయిల్ అనివార్యమయ్యింది. వివరాల్లోకి వెళితే కళ్యాణ్ చక్రవర్తి, బి.జిమ్మిరాజు, గోపాలకృష్ణ, ప్రసాద్‌లు 55 మంది ఎంఎల్‌టీ విద్యార్థినులను వేధింపులకు గురిచేయగా వారు కొంతకాలం పాటు బిక్కుబిక్కుమని ఎవరికి చెప్పకుండా బాధను దిగమింగుకుని విధులకు హాజరైనా ఆ కీచకుల ఆగడాలు శృతిమించడంతో కళాశాల యాజమాన్యానికి భయంభయంగా మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయడంతో కళాశాల ప్రిన్సిపాల్ వేగంగా నిందితులపై పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు చేశారు. దాంతో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సెక్షన్ 354, సెక్షన్ 519 కింద, అలాగే టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో సెక్షన్ కింద కేసులు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేశారు. అయితే 2 సెక్షన్‌లో బెయిల్ మంజూరైనా పోక్సో కేసులో మాత్రం నలుగురికి న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌కి తరలించారు. అయితే నిందితుడు జిమ్మిరాజును కేసు నుంచి తప్పించడం కోసం అతడి మేనమామ బూరిగ ఆశీర్వాదం చేసిన ప్రయత్నం పోక్సో కేసు అవ్వడంతో ఫలించలేదు.

రెండు మోటారుసైకిళ్లు ఢీ

ఇద్దరికి తీవ్రగాయాలు

కొవ్వూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవం గండిపోచమ్మ ఆలయ మలుపులో ఎదురెదురుగా 2 మోటారుసైకిళ్లు ఢీ కొన్నాయి. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం దివిలికి చెందిన వల్లభశెట్టి వెంకటేష్ పట్టిసీమ వెళ్లి బైక్‌పై తిరిగివస్తున్నాడు. అదే సమయంలో తాళ్లపూడి మండలం రాగోలపల్లికి చెందిన నీరుకొండ పోసిరత్నం కొవ్వూరు నుంచి బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ఇద్దరు కుమారదేవం గండిపోచమ్మ ఆలయం మలుపులో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో కొవ్వూరుప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ధాన్యలక్ష్మి ఆలయంలో చోరీ

అమ్మవారి మెడలో నోట్ల దండ, 2 కాసుల బంగారం, రూ.10వేలు అపహరణ



ఆలయం గోడకు పెట్టిన కన్నం



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం సభ్యుడు

కె.గంగవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం గంగవరం- కోటిపల్లి ప్రధాన రహదారిలో కోట పరిధిలో ఉన్న కోట ధాన్యలక్ష్మి ఆలయంలో చోరీ జరిగింది. ఆలయం వెనుక భాగాన గోడకు కన్నం పెట్టి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలో ఉన్న 4 సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. అమ్మవారి మెడలో రూ.4 వేలు విలువ చేసే నోట్లతో తయారు చేసిన దండ, రూ.10 వేలు, 2 కాసుల బంగారు ఆభరణాలు దొంగిలించుకుపోయారు. హుండీని బద్దలు కొట్టారు. ఐతే హుండీలో డబ్బులు ఇదివరకే తీసివేయడం వల్ల ఏమీ దొరక లేదు. రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్, సీఐ వెంకటనారాయణ చోరీ ప్రదేశాన్ని పరిశీలించారు. క్లూస్ టీం వచ్చి వివరాలు సేకరించారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ. ఎస్‌కె.జానీబాషా పేర్కొన్నారు.

నాలుగేళ్ల కిందట యువతి అదృశ్యం

కనుగొని తల్లిదండ్రులకు అప్పగించిన కొత్తపల్లి పోలీసులు

కొత్తపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సుమారు నాలుగేళ్ల కిందట అదృశ్యమైన యువతి ఆచూకీని కొత్తపల్లి పోలీసులు కనుగొని ఆమె కుటుంబీకులకు అప్పగించారు. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండల పొన్నాడ గ్రామానికి చెందిన ఏడిద లోవలక్ష్మి 2021లో ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో అప్పుడు కొత్తపల్లి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఇటీవల కూటమి ప్రభుత్వం అదృశ్యమైన కేసుల్లో పూర్తిస్థాయి విచారణ చేపట్టిన నేపథ్యంలో లోవలక్ష్మి హైదరాబాద్‌లో ఉందన్న విషయం కొత్తపల్లి పోలీసులకు చేరింది. దీంతో ఎస్ఐ జి వెంకటేష్ హైదరాబాద్ నుంచి తీసుకొచ్చి యువతిని తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

రూ.6 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం

కొవ్వూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): వివిధ కేసులలో నేరాలకు పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.6 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులోని సాంస్కృత పాఠశాల దగ్గరలోని కూల్‌డ్రింక్స్, కూరగాయాల షాపులో ఈనెల 8న రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు బద్దలు కొట్టి రూ.3 వేల నగదు, 2.25 లీటర్ల థమ్సప్ బాటిల్ కేసులు 9, హోమ్ థియేటర్, సిగరెట్ ప్యాకెట్లను దొంగిలించుకు పోయినట్టు షాపు నిర్వాహకుడు తొండ్రంకి కురిమిశెట్టి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ ఆదేశాల మేరకు పట్టణ సీఐ పి.విశ్వం ఆధ్వర్యంలో 2 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దొంగతనానికి పాల్పడిన రాజమహేంద్రవరం నామవరం, మసీదు వద్ద ఎ.బ్లాక్‌కు చెందిన (ప్రసుత్తం కొవ్వూరు మండలం వేములూరులో నివాసం ఉంటున్న) గుడ్ల సతీష్ అలియాస్ పకోడి, తమ్మిశెట్టి సాయి, కొంతమూరుకు చెందిన బొండపల్లి అచ్యుత్ సతీష్‌ను ఈ నెల 12న కొవ్వూరు నందమూరు రోడ్‌లోని బుద్దుడుబొమ్మ సెంటర్‌లో అరెస్టు చేశామన్నారు. వారి నుంచి సుమారు రూ.6 లక్షల విలువైన కొంత చోరీ సొత్తు, ఇతర కేసులకు సంబంధించి 5 మోటారుసైకిల్‌లు, ఆండ్రాయిడ్ ఫోన్, జత వెండి పట్టీలు, బంగారు నక్లెస్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. గుడ్ల సతీష్‌పై కొవ్వూరు పోలీస్‌స్టేషన్‌లో గతంలో 5 కేసులున్నాయని డీఎస్పీ తెలిపారు. కేసును చేధించి నిందితులను అరెస్టు చేయడంలో ప్రావీణ్యం చూపిన సీఐ పి.విశ్వం, ఎస్ఐ పి.రవీంద్రబాబు, సిబ్బంది అబ్బారీబేగ్, జి.అనీల్‌కుమార్, ఆర్.కోట సత్యనారాయణ, కె.జయరాం, ఎస్.గణేష్, ఎస్.కె.వల్లీను జిల్లా ఎస్పీ అభినందించారని చెప్పారు.

పంటకాల్వలో మృతదేహం

తెలంగాణకు చెందిన వ్యక్తిగా గుర్తింపు

మండపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా మండపేట మండలం జెడ్.మేడపాడు వంతెన వద్ద పంట కాల్వలో గత 4 రోజుల నుంచి గుర్తుతెలియని మృతదేహం ఉండడంతో స్థానికులు గుర్తించారు. ద్వారపూడికి చెందిన వీఆర్వో బాపూజీ మండపేట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతుడి జేబులో లభ్యమైన పాన్‌కార్డు ఆధారంగా గొట్టు ముక్కలకూమార్‌రాజు (45)గా, అతడి ది తెలంగాణ రాష్ట్రం దమ్మయ్య గూడ కేసరి మండలం కె.వి.రంగారెడ్డి జిల్లాగా గుర్తించారు. కుటుంబసభ్యులకు సమాచారం అందించామని రూరల్ ఎస్ఐ వి.కిషోర్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న శివరామసుబ్రహ్మణ్యం

అమలాపురం టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి వైశ్యసంఘ పచ్చిగోళ్ల జనార్ధనరావు, కొల్లూరి సత్యనారాయణమూర్తి కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకొళపు శివరామసుబ్రహ్మణ్యం ఆదివారం ప్రారంభించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం, అమలాపురం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి వైశ్యసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరంలో వివిధ విభాగాలను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు పల్లపోతు బంగారం, కొరుప్రోలు వెంకటేశ్వరరావు, నంబూరి రెడ్డియ్య ప్రారంభించారు. వెరికోస్ వెయిన్స్, గుండె, ఆర్థోపెడిక్, గ్యాస్ట్రో, స్కిన్, డెంటల్, ఈఎన్‌టీ, జనరల్ మెడిసన్ విభాగాల వైద్య నిపుణులు వందలాది మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బ్లడ్ టెస్ట్, బీసీ, ఈసీజీ, ఎకో వంటి పరీక్షలను ఉచితంగా నిర్వహించడంతో పాటు రోగులకు రూ.3లక్షల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కంచర్ల వెంకట్రావు (బాబి), కార్యదర్శి కుసుమంచి పాపారావు, కోశాధికారి కంచర్ల కృష్ణమోహన్, సంఘ మెడికల్ కమిటీ చైర్మన్ పచ్చిపులుసు కృష్ణారావు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సింగంశెట్టి కుమార్, ఉపాధ్యక్షుడు వరదా సూరిబాబు, పోశెట్టి సూరిబాబు, కాసు శ్రీనివాస్, పొలిటికల్ కమిటీ చైర్మన్ లక్కింశెట్టి బాబులు, వారణాశి గుప్తా, కాళ్లకూరి కుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలు యెండూరి సీతామహాలక్ష్మి, అమలాపురం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి వైశ్య సంఘ అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, కార్యదర్శి నంబూరి నరేష్,కోశాధికారి కె.వెంకటాచలప్రసాద్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఉషశ్రీ ఎంపిక



ఉషశ్రీ యోగాసనం

అమలాపురం టౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అమలాపురం శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమంలో శిక్షణ పొందుతున్న అడ్డగళ్ల ఉషశ్రీ జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్టు యోగా గురువు ఆకుల శ్రీనివాస్ తెలిపారు. ఢిల్లీలో ఈ నెల 14,15,16 తేదీల్లో జాతీయస్థాయి యోగా పోటీలు జరుగుతాయని, ఈ పోటీల్లో రాష్ట్రం నుంచి ఉషశ్రీ పాల్గొంటారని తెలిపారు.

కోట శ్రీనివాసుకు రాకా సంస్థ నివాళులు



కోట చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాకా సంస్థ సభ్యులు

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు, పద్మశ్రీ కోట శ్రీనివాసరావు మృతికి రాకా సంస్థ సభ్యులు నివాళులర్పించారు. రాకా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ కంటే వీరన్నచౌదరి ఆధ్వర్యంలో వీరన్న చౌదరి ఆసుపత్రి ఆవరణలోని ఎస్పీ బాలు సాంస్కృతిక మందిరంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో సభ్యులు దివంగత సినీ నటుడు కోట శ్రీనివాసరావుకు మౌనం పాటించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వీరన్నచౌదరి మాట్లాడుతూ ఆహా నా పెళ్లంట సినిమాలో కోట నటన అనితర సాధ్యమని కొనియాడారు. కార్యక్రమంలో తోట సుబ్బారావు, తిరుమల కృష్ణమోహన్, జీవీ రమణ, సూరపురెడ్డి తాతారావు, పి.శేషుకుమార్ పీవీఎస్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ పురందేశ్వరి సంతాపం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సినీ హాస్యనటుడు కోట శ్రీనివాసరావు మృతికి రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తీవ్ర సంతాపం తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ సినిమా పరిశ్రమ గర్వించదగిన విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు అని కొనియాడారు. నాలుగు దశాబ్దాలుగా 750కి పైగా చిత్రాల్లో విభిన్న తరహా పాత్రలు పోషించి తెలుగు చిత్రసీమలో తనదైన చెరగని ముద్ర వేశారన్నారు. ఆయన మరణం సినీ ప్రపంచానికి తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నానని పురందేశ్వరి పేర్కొన్నారు.

కామయాని అనువాద కావ్యం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ప్రముఖ హిందీ రచయిత జయశంకర్ ప్రసాద్ 1936లో రచించిన, హిందీలో అత్యంత ప్రాచుర్యం పొందిన కామయాని కావ్యాన్ని తెలుగులోకి అనువదించిన హెచ్ఎస్ఎం కామేశ్వరరావుకు అభినందన సత్కార సభ ఆదివారం తిలక్ రోడ్‌లోని శ్రీ వాగ్దేవు విజయలక్ష్మ ఫంక్షన్ హాల్‌లో జరిగింది.దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గెయిల్ చీఫ్ జనరల్ మేనేజర్ కేవీఎస్ రావు కామయాని కావ్యాన్ని తెలుగులోకి అనువదించిన కామేశ్వరరావును అభినందించి అనంతరం కావ్యాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రచయితలు ఆర్ఎస్ వెంకటేశ్వరరావు, కాలెపు గణేష్‌రామ్, మీరాస్వామి, కె.సునీత, పి.రామారావు, ఎం.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

24న చౌడేశ్వరమ్మ జయంతోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): దేవాంగ కుల దేవత శ్రీ చౌడేశ్వరమ్మ జయంతోత్సవం ఈ నెల 24న జాంపేట శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్టు సంఘ నగర ప్రధాన కార్యదర్శి కాలెపు సత్యనారాయణ మూర్తి తెలిపారు. నగర అధ్యక్షుడు రొడ్డి విజయ శేఖర్ అధ్వర్యంలో ఆదివారం కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రిలోని దేవాంగ సంఘీయులంతా అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కేకే సంజీవరావు, బీరా శ్యామలరావు, చింతా వెంకటచలపతి, పూర్ణిమ ప్రసాద్, నల్లా శంకరరావు, బీరా పద్మనాభరావు, మావూరి బాబురావు, పిచ్చిక అనిల్‌కుమార్, పింజర్ల భాస్కరరావు పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములవ్వాలి

రంగంపేట, జూలై 13(ఆంధ్రజ్యోతి): శ్రీ షిరిడిసాయి, శ్రీసత్యసాయి అవతార వైభవం తెలుసుకొని సమాజ సేవా కార్యక్రమాల్లో సమైక్యంగా భాగస్వాములు కావాలని శ్రీ సత్యసాయిసేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం మండలంలోని పాతవీరంపాలెంలో శ్రీసత్యసాయి భజన మండలి కన్వీనర్ నాగులపల్లి భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ సత్యసాయి సామూహిక వ్రత కార్యక్రమాన్ని ప్రశాంతి పతాక ఆవిష్కరణ చేసి ప్రారంభించి మాట్లాడారు. శ్రీసత్యసాయి జయంతి ఉత్సవాల కార్యక్రమంలో నిర్వహించే మహా నారాయణసేవ(అన్నప్రసాద వితరణ)లో సుమారు 175 దేశాల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. అన్ని విభాగాల కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బిక్కిన రామలక్ష్మి, తిక్కిశెట్టి గోవిందరాజులు, ఎల్.శ్రీనివాసరాజు, మల్రెడ్డి వీర్రాజు, కందర్ప వెంకట అమర్నాథ్, తిక్కిశెట్టి సుబ్బారావు పాల్గొన్నారు.

చర్మ వ్యాధుల వైద్య శిబిరం

రాజానగరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): చర్మ వ్యాధుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలని పలువురు వైద్యులు సూచించారు. ప్రపంచ చర్మ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జీఎస్ఎల్ జనరల్ హాస్పిటల్ చర్మవ్యాధుల విభాగం(డీవీఎల్), జాతీయ చర్మ వ్యాధుల అసోసియేషన్(ఐఏడీవీఎల్) ఆధ్వర్యంలో రాజానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో ఆదివారం ఉచిత చర్మ వ్యాధుల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 250 మందికి చర్మ సంబంధిత మచ్చలను పరీక్షించి, చర్మ వ్యాధులపై అవగాహన కల్పించారు. అలాగే చర్మ సంబంధ వ్యాధుల అనుమానిత లక్షణాలున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో జీఎస్ఎల్ చర్మ వ్యాధుల విభాగం అధిపతి డాక్టర్ సీతారాం, ప్రొఫెసర్లు డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ సుభాషిణి, పీజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు వాడితే చర్యలు

ధవళేశ్వరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం గ్రామంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వాడకంపై నిషేధం అమలు చేస్తున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి జి.వెంకట్రావు ఒక ప్రకటనలో తెలిపారు. షాపులు, హోటల్స్, మార్కెట్‌లో క్యారీ బ్యాగ్‌లు, ప్లాస్టిక్ స్పూన్లు, స్ట్రాలు, ఫోర్క్‌లు, గ్లాసులు, ఆహారం ప్యాక్ చేసే బాక్సులు వాడవద్దని సూచించారు. నిషేధించిన ప్లాస్టిక్ వస్తువులు అమ్మవద్దని వ్యాపార వర్గాలను హెచ్చరించారు. ఈ వస్తువులు వాడినా, సరఫరా చేసినా అటువంటి వారిపై జరిమానా విధిస్తామన్నారు.

రఘుదేవపురంలో చోరీ

సీతానగరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రఘుదేవపురం రవీంద్రనగర్ కాలనీలోని ఓ ఇంట్లో చోరీ జరిగిందని ఎస్ఐ డి.రామ్‌కుమార్ ఆదివారం తెలిపారు. కాలనీకి చెందిన సురవరపు మణికంఠ నిడదవోలులో ఉంటున్న తన అక్క దగ్గరకు రెండు వారాల క్రితం వెళ్లాడు. శనివారం తిరిగి వచ్చేసరికి ఇంటికి వేసిన తాళం బద్దలుగొట్టి ఉంది. లోపల సామాన్లు చెల్లాచెదురుగా ఉండడంతో పోలీసులకు సమాచారం అందించాడు. 4 కాసుల బంగారం, 30 తులాల వెండి, రూ.3.90 లక్షల నగదు చోరీకి గురైనట్టు గుర్తించారు. హెడ్ కానిస్టేబుల్ శ్రీను సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు.

పూర్వ విద్యార్థుల ప్రతిభకు పురస్కారం


పూర్వ విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎన్ రోడ్‌లోని ఎస్వీ ఫంక్షన్ హాల్‌లో శ్రీగౌతమి విద్యాసంస్థలు.. తమ స్కూలు పూర్వ విద్యార్థులు 2025లో సాధించిన ప్రతిభను సత్కరించే ప్రతిభా పురస్కార్-2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రీజనల్ డైరెక్టర్, మునిసిపల్ ఎడ్మినిస్ట్రేషన్ రాజమండ్రి రీజియన్ సీహెచ్ నాగ నరసింహారావు జ్యోతి ప్రజ్వలన చేసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయం కోసం విద్యార్థులకు గట్టి సంకల్పం అవసరమని, దాన్ని చేరుకోవడానికి నిరంతరం శ్రమించాలన్నారు. పూర్వ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. పురస్కార గ్రహీతలను, వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో శ్రీగౌతమి విద్యాసంస్థల డైరెక్టర్ సుంకర రవికుమార్, సుంకర మల్లికార్జున్, ప్రిన్సిపాల్, ప్రస్తుత విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం : ఎస్ఐ

అనపర్తి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేసేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని ఎస్ఐ శ్రీనునాయక్ అన్నారు. ఆదివారం అనపర్తి కెనాల్ రోడ్డులోని హోండా షోరూం వద్ద వాహన చోదకులకు హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక ప్రమాదాల్లో హెల్మెట్ ధరించక పోవడంతోనే ప్రాణాలు పోతున్నాయన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలు కాపాడుకునే వీలు ఉంటుందని ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ దుర్గాప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిత్య విద్యార్థుల స్వచ్ఛభారత్

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాలల ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లు ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. కోటిపల్లి బస్టాండ్ సమీపంలోని తహశీల్దార్ కార్యాలయం పక్కనున్న రెడ్‌క్రాస్ సొసైటీ ప్రాంగణంలో వ్యర్థాలను తొలగించి ప్లాస్టిక్‌ను ఏరివేసి, పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సభ్యులు, రెడ్‌క్రాస్ సిబ్బంది, ఆదిత్య అధికారులు పాల్గొన్నారు.

మారమ్మ తల్లికి సారె

సీతానగరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): రాపాక గ్రామ దేవత శ్రీ మారమ్మ తల్లికి 108 వంటకాలతో సారె అందించారు. ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు చీరలు, 108 రకాల వంటలను బిందెల్లో ఉంచి ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని అమ్మవారికి సారె సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అర్చనలు నిర్వహించారు.

జీతం బకాయిలు ఇవ్వరా!?


పనుల్లో మహిళా సఫాయి వాలాలు

- మహిళా సఫాయి వాలాల ఎదురుచూపులు
- అధికారుల చుట్టూ ఏడాదిగా.. 25 మంది మహిళల ప్రదక్షిణాలు

రాజమహేంద్రవరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): చిరుద్యోగులని జాలి లేదు.. మహిళలనే దయ అంతకంటే లేదు.. ఇదీ మహిళా సఫాయి వాలాల పట్ల రైల్వే అధికారులు, కాంట్రాక్టు సంస్థ అనుసరిస్తున్న తీరు. అధికారులు ఏ పని చెప్పినా కాదనకుండా రెక్కలు ముక్కలు చేసుకుంటున్నా చిన్నపాటి బకాయిలు చెల్లించడానికి కూడా ప్రదక్షిణలు చేయించుకోవడం ఆక్షేపణీయంగా కనిపిస్తోంది. రాజమండ్రి ప్రధాన రైల్వే స్టేషన్లో 25 మంది మహిళా పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు.వీళ్లను కాంట్రాక్టరు ద్వారా నియమించుకోగా.. హెల్త్ ఇన్‌స్పెక్టర్ ప్రతి రోజూ పని పురమాయించుకొంటారు. టాయిలెట్ల క్లీనింగ్ దగ్గర నుంచీ చెత్తను లారీలోకి ఎత్తడం వరకూ అన్నీ వీళ్లే షిష్టుల వారీగా చేస్తారు. రాత్రి వేళల్లో కూడా ఇద్దరు విధుల్లో ఉంటారు. అయితే వీళ్లకు జీతాలను మాత్రం సక్రమంగా చెల్లించడం లేదు. 2023లో మూడు నెలల జీతం బకాయి పడగా 'ఆంధ్రజ్యోతి' విషయాన్ని వెలుగులోకి తీసుకురావడంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ రంగంలోకి దిగడంతో కాంట్రాక్టరు జీతాలు చెల్లించారు. తర్వాత ఆ కాంట్రాక్టు సంస్థ నిబంధనల ప్రకారం నడుచుకోకపోవడాన్ని కూడా 'ఆంధ్రజ్యోతి' బహిర్గత పరచగా కాంట్రాక్టును రైల్వే రద్దు చేసింది. మరొక సంస్థకు రైల్వే స్టేషను పారిశుధ్య పనులను అప్పగించింది. అయితే పాత కాంట్రాక్టరు 2024 జూలై నుంచి అక్టోబరు వరకూ పారిశుధ్య కార్మికులకు జీతాలు బకాయి పడ్డారు. వాటి గురించి ఏ అధికారికి విన్నవించినా ఫలితం శూన్యమవుతోంది. ఉన్నతాధికారులు వచ్చినప్పుడు గోడు వినిపించుకుందామంటే వారి సమీపానికి కూడా వీళ్లను వెళ్లనీయడం లేదు. కార్మికుల కోసం పనిచేసే రైల్వే లేబర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారికి విన్నవిస్తే.. ఆ కాంట్రాక్టరుకు రైల్వేకి మధ్య వివాదాలు ఉన్నాయని, అవి కోర్టులో తేలితే గానీ జీతాల బకాయిలు చెల్లించరంటూ కాంట్రాక్టరుకు వత్తాసుగా సమాధానం ఎదురైంది. వాస్తవానికి నిబంధనల ప్రకారం జీతాలను క్రమం తప్పకుండా కాంట్రాక్టరు చెల్లించాలి. కానీ ఏడాది కావస్తున్నా పాత బకాయిలు ఇవ్వడం లేదు. కాంట్రాక్టు సంస్థకు రైల్వేకు కోర్టులో నడుస్తున్న కేసులకు తమ జీతాలకు ముడి పెట్టడం ఎంత వరకూ సమంజసమని మహిళా పారిశుధ్య కార్మికులు వాపోతున్నారు. ఒకవేళ గట్టిగా నిలదీస్తే ఉద్యోగం ఉంటుందో ఊడుతుందో తెలియని పరిస్థితుల్లో కనబడిన అధికారిని బ్రతిమలాడుకోవడం తప్ప గత్యంతరం ఉండడం లేదని అంటున్నారు. ఒక్కోసారి పోలీసులను ప్రయోగించి మరీ భయపెడుతున్నారని..మళ్లీ డీఎల్ఎస్ఏ, కార్మిక సంక్షేమ అధికారులు కల్పించుకొని తమ జీతం బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని మహిళా పారిశుధ్య కార్మికులు వేడుకొంటున్నారు.




మహిళా సఫాయి వాలాలు

స్థానిక ఎన్నికల్లో జనసేన సత్తా చాటాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల

- నియోజకవర్గంలోని అన్ని పంచాయతీలు గెలవాలి
- వచ్చే నెలలో గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి కమిటీల ఏర్పాటు
- జనశ్రేణుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

రాజానగరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గం లోని అన్ని పంచాయతీలను జనసేన కైవశం చేసుకునే దిశగా జనసైనికులు సమష్టిగా పనిచేయాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పిలుపునిచ్చారు. నియోజకవర్గ జనశ్రేణుల ఆత్మీయ సమావేశం రాజానగరంలోని రాయల్ ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగింది. మండల కన్వీనర్ వేగిశెట్టి రాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బత్తుల ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కూటమి నిర్ణయానికి అందరం కట్టుబడి ఉండాలన్నారు. వైసీపీ పాలనలో పేకాట, గుండాట, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌ల ఆగడాలు, ఇసుక, కొండలు, చెరువుల్లో మట్టి అక్రమ విక్రయాలు తప్ప నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. కూటమి 13 నెలల పాలనలో నియోజకవర్గంలోని 422 కుటుంబాలకు ఇప్పటి వరకు రూ.3.80 కోట్ల సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశామన్నారు. జనసేన పార్టీని సంస్థాగతంగా ముందుకు తీసుకెళ్లడంతో పాటు రానున్న శ్రావణ మాసంలో గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి కమిటీలు ఏర్పాటు చేసుకుందామన్నారు. ఆగస్టు నెలాఖరుకు నియోజకవర్గంలోని 83 గ్రామాల్లోనూ కమిటీలను పూర్తి చేసే యోచన ఉందన్నారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ పదవులు మనమే కైవశం చేసుకునే దిశగా ఇప్పటి నుంచి ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లాలన్నారు. సమావేశంలో నాసేన కోసం నావంతు కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండ లాల నాయకులు, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

ప్రపంచ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలి


విజేత జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న చైతన్యరాజు

- జీజీయూ ఛాన్సలర్ చైతన్యరాజు
- గైట్‌లో ముగిసిన ఏపీ సబ్ జూనియర్ బాలుర ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్-2025

రాజానగరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఫుట్‌బాల్ క్రీడలో మంచి నైపుణ్యం సాధించి ప్రపంచ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయూ) ఛాన్సలర్ చైతన్యరాజు ఆకాంక్షించారు. జీజీయూ ప్రాంగణంలోని క్రీడా ప్రాంగణంలో రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఏపిక్ స్పోర్ట్స్ ఫుట్‌బాల్ అకాడమీ నిర్వహణలో రెండు రోజులుగా నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్ బాలుర ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్-2025 ఆదివారం ముగిసింది.ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ప్రెసిడెంట్ మండవిల్లి వెంకన్నబాబు అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి చైతన్యరాజు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. చైనా తర్వాత భారతదేశం అన్ని క్రీడల్లోనూ ముందుంటోందన్నారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన ఎన్టీపీసీ కేజీ-పీజీ మేనేజర్ కె.కర్వనన్నన్ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఈ క్రీడా పోటీలకు హాజరైన బాలలను ఆశీర్వదించారు. చార్టర్ ప్రెసిడెంట్ తీగల రాజా మాట్లాడుతూ రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాల నుంచి 275 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారని చెప్పారు. 13 సంవత్సరాల బాలురకు ఈ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ నిర్వహించామన్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డీఎంఎం శేషగిరి మాట్లాడుతూ క్రీడాకారులు ఓటమి ఎదురైనప్పటికి నిరాశ చెందకూడదని నేటి ఓటమే రేపటి గెలుపునకు మెట్టు అవుతుం దన్నారు. కాగా ఈ ఛాంపియన్‌షిప్‌లో అనంత పురం జిల్లా ప్రథమ స్థానం సాధించగా, కృష్ణా ద్వితీయ స్థానాన్ని, తిరుపతి తృతీయ స్థానాన్ని సాధించినట్టు హెడ్ ఆఫ్ ది రిఫరీ పి.శ్రీనివాస రావు తెలిపారు. కార్యక్రమంలో గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం ఉపకులపతి యు.చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి వి.విజయ కుమార్, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు వి.రాజశేఖర్, దేవి ఫిషరీస్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ ఎం.కిరణ్‌కుమార్ రెడ్డి, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ 24-25 ఇమ్మనేని వెంకట్, క్లబ్ ఉపాధ్యక్షుడు మద్దూర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటికి వెళ్లకుండానే.. గుండె ఆగింది!

- బిక్కవోలులో వృద్ధుడి మృతి
- మృతుడి స్వస్థలం పాత ఇసుకపల్లి

బిక్కవోలు, జూలై 13(ఆంధ్రజ్యోతి): బలభద్రపురం బస్టాండ్ వద్ద ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానిక వీఆర్‌వో మాచవరపు శ్రీనివాస్ కనుగొన్నారు. బస్టాండ్ వద్ద సైకిలు స్టాండ్ వేసి వుందని పక్కనే ఒక వ్యక్తి సొమ్మసిల్లి పడి ఉండడంతో అతడిని పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడన్నారు. అతడి సైకిలుకు వున్న సంచిలో పుస్తకం మీద జి.రాముడు అని రాసి వుందన్నారు. దీంతో బిక్కవోలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ విచారణ జరపగా కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం పాత ఇసుకపల్లికి చెందిన గంపల రాముడు(70)గా గుర్తించారు. రాముడు భార్య, కొడుకు, కోడలు పులగుర్తలోని ఒక ఇటుకల బట్టీలో పనిచేస్తున్నారని, ఆదివారం ఇంటికి వెళ్లడం కోసం రాముడు సైకిలు మీద, మిగిలిన వారు ఆటోలో బయలుదేరారన్నారు. రాముడు సైకిలు తొక్కుతూ బలభద్రపురం బస్టాండ్ వద్దకు వచ్చేసరికి గుండె పోటుతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. రాముడు ఎంతకీ రాకపోవడంతో అతడి కుమారుడు నానాజీ వచ్చి తన తండ్రిగా గుర్తించి ఫిర్యాదు ఇవ్వడంతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ పేర్కొన్నారు.

బిక్కవోలులో తొలి అడుగు

బిక్కవోలు, జూలై 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక బిక్కవోలు గ్రామంలో ఏడాది కాలంలో రూ.19.10 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్టు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన బిక్కవోలులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి యేడాది కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ముద్రించిన కరపత్రాలను అందజేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రిటైనింగ్ వాల్ ఏర్పాటు చేయాలని కోరగా అంబటి పేట వాసువులు కోరగా వెంటనే అధికారులు వాల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ తేతలి సుమ, సర్పంచ్ సరెళ్ల సుమలత, కూటమి నాయకులు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, పల్లి వాసు, పడాల చినబుజ్జి, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, గొర్రెల త్రిమూర్తులు, సింగారపు రామారావు పాల్గొన్నారు.


బిక్కవోలులో కరపత్రాలను పంపిణీ చేస్తున్న మనోజ్‌రెడ్డి

నేడు జాబ్ మేళా

రాజమహేంద్రవరం సిటీ, జూలై 13(ఆంధ్రజ్యోతి): స్థానిక మోడల్ కెరీర్ సెంటర్‌లో సోమవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి అధికారి హరిశ్చంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం నర్సింగ్, 10వ తరగతి పూర్తి చేసి, 19నుంచి 35 ఏళ్ల వయసున్న వారు ఉదయం 10గంటలకు సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. మరింత సమాచారం కోసం 95332 21189 నెంబరును సంప్రదించాలన్నారు.

జిత్ మోహన్ అభినందన సభ

రాజమహేంద్రవరం కల్చరల్ జూలై12(ఆంధ్రజ్యోతి): నటుడు, గాయకుడు జిత్‌మోహన్ మిత్ర తన తొలి చిత్రం ముత్యాల ముగ్గులో నటించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్థానిక గోకవరం బస్టాండ్ వద్దనున్న జిత్ మోహన మిత్ర కళావేదికలో ఆదివారం అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సినిమా ప్రస్థానం 50 ఏళ్లు పూర్తయిందని, అందుకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం మృతి చెందిన తన మిత్రుడు, కోట శ్రీనివాసరావుకు తీవ్ర సంతాపం తెలియజేశారు. కోట, తాను కలిసి సుమారు 50 సినిమాల్లో నటించామని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు శ్రీనివాసరావు, పిచ్చుక మహేష్, నాగేంద్ర, పోస్టల్ ప్రసాద్, హరి, వంక బాలకృష్ణ, నళిని, చందన, సూర్యకుమారి పాల్గొన్నారు.

రాజకీయ ప్రయోజనాల కోసం వైసీపీ నాయకుల రాద్ధాంతం

అనపర్తి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గత నెల 8న దుప్పలపూడిలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బండారు వెంకటేశ్వరరావు కుటుంబానికి న్యాయం చేయాలని ప్రయత్నం చేసిన కూటమి నాయకులపై అక్రమ కేసులు పెట్టిన వైసీపీ నాయకులు రాజకీయ ప్రయోజనం కోసమే రాద్దాంతం చేస్తున్నారని టీడీపీ జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు సిరసపల్లి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం దుప్పలపూడిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేసే క్రమంలో ఇరు వర్గాల మధ్య రాజీ కుదరకపోగా ఘర్షణ తలెత్తితే కూటమి నాయకుడిపై కేసు నమోదు చేయించారన్నారు. ఈ ఘటనపై రాజకీయ ప్రయోజనాల కోసం మాజీ ఎమ్మెల్యే ఇష్టానుసారం మాట్లాడుతున్నారన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కడియం, జూలై 13(ఆంధ్రజ్యోతి): వేమగిరిలో 1996-97లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాల నిమిత్తం వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ స్నేహితులు వేమగిరి చేరుకున్నారు. చిన్ననాటి సంగతులను జ్ఞాపకం చేసుకుని ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా.. సహకార బ్యాంక్ పర్సన్‌గా నియమితుడైన తమ మిత్రుడు పితాని శివరామకృష్ణను సత్కరించారు.

కుమార్‌కు ప్రెస్‌క్లబ్ నివాళి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 13(ఆంధ్రజ్యోతి): ప్రముఖ దినపత్రిక రిపోర్టర్‌గా పనిచేస్తూ ఇటీవల మృతిచెందిన జర్నలిస్ట్ మెట్ల కుమార్‌కు ది రాజమండ్రి ప్రెస్‌క్లబ్ నివాళులర్పించింది. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో అధ్యక్షుడు కుడుపూడి పార్థసారధి అధ్యక్షతన జరిగిన సంతాప సభలో సీనియర్ పాత్రికేయుడు మండేల శ్రీరామ్మూర్తి సహా పలువురు రిపోర్టర్లు, సబ్ ఎడిటర్లు, ఫొటోగ్రాఫర్లు.. కుమార్ చిత్రపటానికి నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

మిడిల్ క్యాయిన్ ఆడుతున్న తొమ్మిది మంది అరెస్టు

సీతానగరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీపురుపల్లి పంచాయతీ పరిధిలోని అచ్చియ్యపాలెంలో మిడిల్ కాయిన్ ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ డి.రామ్‌కుమార్ ఆదివారం తెలిపారు. సిబ్బందితో దాడిచేసి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.18 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమో దు చేసినట్టు పేర్కొన్నారు.


కోడిపందాలు ఆడుతున్న నలుగురి అరెస్టు

సీతానగరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రఘుదేవపురం శివారున కోడిపందాలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ రామ్‌కుమార్ ఆదివారం తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు కోడిపందాలు ఆడుతుండగా దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3,500 రెండు పందెం కోళ్లు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్టు ఆయన తెలిపారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: ఓ భామ అయ్యో రామ
సూర్యమినీ	: ఎఫ్1 ది మూవీ, 3బీహెచ్‌కే
సూర్యప్యాలస్	: జురాసిక్ వరల్డ్, డి-100
స్వామి	: కుబేర
శివజ్యోతి	: తమ్ముడు
అనుశ్రీ(సాయికృష్ణ)	: సూపర్‌మేన్
రాజా	: సూపర్‌మేన్
ఊర్వశి	: మిరపకాయ్, కుమారి 21ఎఫ్
రంభ	: మార్గన్
మేనక	: జురాసిక్ వరల్డ్
అప్సర	: సూపర్‌మేన్
కుమారి	: ----
అశోక	: సూపర్‌మేన్
వీఎస్ మహల్(నామవరం)	: సూపర్‌మేన్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: సూపర్‌మేన్
వెంకటసూర్య(కడియం)	: సూపర్‌మేన్
సత్యగౌరి (అనపర్తి)	: ఓ భామ అయ్యో రామ
సూర్యశ్రీ (అనపర్తి)	: కుమారి 21ఎఫ్
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: సూపర్‌మేన్
రామకృష్ణ(కోరుకొండ)	: ఏస్
గీతాసినిమాస్ (సీతానగరం)	: తమ్ముడు
శ్రీనివాస (గోకవరం)	: సూపర్‌మేన్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: కుమారి 21ఎఫ్
లలితామహల్(రంపచోడవరం)	: తమ్ముడు
నవయుగ(చింతూరు)	: తమ్ముడు



దొంగతనం కేసులో ముగ్గురి అరెస్టు
సీజ్ చేసిన డ్రెడ్జింగ్ బోటు దొంగతనం 8

గోదావరిలో బోట్ షికారుకు బ్రేక్

రాజమహేంద్రవరం,జూలై 13 (ఆంధ్రజ్యోతి) : అఖండ గోదావరిలో బోట్ షికారుకు బ్రేక్ పడింది. వరద పోటు వల్ల మూడు పెద్ద బోట్లు, ఒక స్పీడ్ బోట్‌ను ఆపేశారు. ఫ్లోటింగ్ రెస్టారెంట్ మూతపడింది. కొన్ని నెలల కిందట గోదావరిలో ఫ్లోటింగ్ రెస్టారెంట్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. మొదట్లో ఈ రెస్టారెంట్ ఏర్పాటు చేసినపుడు విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు మాటిచ్చారు. కానీ లంకలోకి విద్యుత్ సౌకర్యం ఇచ్చే పరిస్థితి కనిపించకలేదు. రోజుకు రూ.15వేల వరకూ డీజిల్ ఖర్చు అవుతుందని చెబుతూ రెస్టారెంట్ నిర్వాహకుడు శ్రీనివాస్ దీనిని సుమారు మూడు నెలల కిందట ఒడ్డుకు చేర్చారు. ప్రస్తుతం వరద ఎక్కువగా ఉండడంతో ఆదివారం నుంచి రెస్టారెంట్ మూసి వేశారు. సుమారు రెండు నెలల వరకూ ఇది తెరిచే అవకాశం లేదని నిర్వాహకులు చెప్పడం గమనార్హం.



మూత పడిన ఫ్లోటింగ్ రెస్టారెంట్

భూ..కేర్ ఫుల్!



భూ పందేరానికి కూటమి ప్రభుత్వం చెక్

ఖాళీ జాగా కనబడితే చాలు.. అది ప్రభుత్వానిదా?.. ప్రైవేటుదా?..అనే విషయం అసలు పట్టించుకోరు.. ఆక్రమించేస్తారు.. ఠక్కున లింక్ డాక్యుమెంట్లు పుట్టిస్తారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో డబ్బుల కట్టలు విసిరి ఆ భూమిని చుట్టబెట్టేస్తారు. బాధితులు లబోదిబోమన్నా కదలరు వదలరు.. గత ప్రభుత్వంలో కబ్జా అనేది ఒక వృత్తిగా అవతరించింది. జడ్జి రామకృష్ణ భూములు ఒక వైసీపీ నాయకుడు ఆక్రమించారని గగ్గోలు పెట్టినా ఏం చేయలేని పరిస్థితి. నాడు ఇలా ఎందరో బాధితులు తమ భూములు ఆక్రమించారని పోలీస్ స్టేషన్, కోర్టు మెట్లు ఎక్కిన వారున్నారు.. అయినా లాభం లేకపోయింది.. కూటమి ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించిందో ఏమో కానీ.. భూ అక్రమాలకు చెక్ పెట్టేందుకు చర్యలు చేపట్టింది.

(ఆంధ్రజ్యోతి-రాజమహేంద్రవరం)

భూ అక్రమాలకు ప్రభుత్వం చెక్ పెట్టింది. ఇప్పటి వరకూ రిజిస్ట్రేషను రద్దు అధికారం పౌర న్యాయస్థానాలకు మాత్రమే ఉండగా.. ఇప్పుడు ఆ అధికారం కలెక్టర్‌కి దాఖలు పరుస్తూ చట్టం అమల్లోకి వచ్చింది. ఆస్తుల రిజిస్ట్రేషన్లు అక్రమంగా జరిగితే వాటిని రద్దు చేసే అధికారాన్ని కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటయ్యే కమిటీకి దాఖలు పరుస్తూ 1908 నాటి చట్టానికి సవరణలు చేస్తూ రాష్ట్ర శాసన సభ ఆమోదం తెలిపింది. శాసన సభ ఆమోదించిన సవరణ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం తెలపడంతో ప్రభు త్వం జారీ చేసిన నోటిఫికేషన్ బుధవారం నుంచి అమల్లోకి వచ్చేసింది. వాస్తవానికి భూముల క్రయ, విక్రయాల సమయంలో సబ్- రిజిస్ట్రార్లు ఆ భూమి/స్థలానికి సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలి. ఒక వేళ ప్రభుత్వానికి చెందిన లేదా నిషేధిత జాబితా (22ఏ)లో ఉన్న భూముల వివరాలను రెవెన్యూ శాఖ రిజిస్ట్రేషన్ల శాఖకు అందజేస్తుంది. ఆ జాబితాలో ఉన్న భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ రిజిస్ట్రేషను చేయడానికి వీల్లేదు. ప్రభుత్వ భూములను కాపాడడంలో కలెక్టర్‌కి ఎంత బాధ్యత ఉంటుందో.. సబ్-రిజిస్ట్రార్లకూ అంతే ఉంటుంది. అది వారి విధి కూడా. అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు రుజువైతే సబ్-రిజిస్ట్రారుకు మూడేళ్ల నుంచి ఏడేళ్ల వరకూ జైలు శిక్ష విధించే అవకాశాన్ని చట్టం కల్పిస్తోంది.కానీ చట్టాల్లో ఉన్న లొసుగులు, కోర్టుల్లో ఏళ్లకు తరబడి విచారణ నడవడం వంటి కారణాలతో వాళ్లకు భయం, బాధ్యత పోయాయి. వాస్తవానికి మోళీ తతంగానికి సబ్-రిజిస్ట్రారు కార్యాలయమే కేంద్ర బిందువుగా ఉంటుంది. చట్టాలు ఉన్నా ఇప్పటి వరకూ యథేచ్ఛగా భూ అక్రమ రిజిస్ట్రేషన్లు జరుగుతూనే ఉన్నాయి.

ఫ్రీ హోల్డ్ పేరుతో..

22(ఎ) జాబితాలో ఉన్న భూములను కబ్జాదారులు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించుకుంటూనే ఉన్నారు. వాస్తవానికి నిషేధిత భూముల జాబితా ఐజీఆర్ఎస్ వెబ్‌సైట్‌లో గ్రామాలు, సర్వేల వారీగా ఉంటుంది. కానీ దానిపై పెద్దగా అవగాహన లేక ప్రభుత్వ, ప్రైవేటు భూములను ఆక్రమణదారులు చేజిక్కించుకుంటున్నారు. 2023లో వైసీపీ ప్రభుత్వం అడిన ఫ్రీహోల్డు నాటకం భూ పందేరానికి పరాకాష్ఠగా చెప్పవచ్చు. నిషేధిత జాబితాలో ఉన్న కొన్ని భూములను, చుక్కల భూములను అప్పట్లో జాబితా నుంచి తొలగించారు. దీనినే ఫ్రీహోల్డు అంటారు. దీంతో వీటికి రిజిస్ట్రేషను చేయించుకొనే వెసులుబాటు కలిగింది. అంతే.. వైసీపీ నాయకులు రంగంలోకి దిగారు. ఉమ్మడి తూర్పు గోదావరిలో వందలాది ఎకరాలు చుట్టబెట్టేశారు. ఎంతలా అంటే అటు రెవెన్యూ, ఇటు రిజిస్ట్రేషన్ల అధికారుల లెక్కలకు పొంతన కుదరనంతగా నొక్కేశారు. ఉదాహరణకు తూర్పు గోదావరి జిల్లాలో 5120 ఎకరాలను ఫ్రీహోల్డు చేశారు. వీటిలో 47 లావాదేవీల ద్వారా 41.866 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు జరిగాయని జిల్లా రిజిస్ట్రారు కార్యాలయ రికార్డులు చెబుతుంటే.. 100 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు జరిగాయని కలెక్టరేట్ అధికారులు వెల్లడిస్తున్నారు. ఇప్పుడు కొత్తగా వచ్చిన చట్టంతో ఫ్రీహోల్డును సెట్‌చేసే పనిని కూడా ప్రభుత్వం మొదలు పెట్టనుంది.

కొత్త చట్టం ఏం చెబుతుందంటే..

కొత్తగా వచ్చిన చట్టంతో ప్రతి జిల్లాలో ఒక కమిటీ ఏర్పడుతుంది. జిల్లా కలెక్టరు చైర్మన్‌గా ఉంటే, రిజిస్ట్రేషన్ల శాఖ, రెవెన్యూ తదితర శా ఖల నుంచి ఇతర సభ్యులు ఉంటారు. అక్ర మంగా రిజిస్ట్రేషను జరిగిందని కలెక్టర్‌కి ఫిర్యాదు అందిన తర్వాత కమిటీ రంగంలోకి దిగుతుంది. రిజిస్ట్రేషను అక్రమమని తేలితే రద్దు చేస్తారు. ఇప్పటి వరకూ ఈ అధికారం క్రయ విక్రయదారులిద్దరూ కలిపి లేదా సివిల్ కోర్టుల చేతుల్లోనే ఉండేది. కొత్తగా వచ్చిన చట్టంతో ఖర్చు, సమయం కూడా ఆదా అవు తుందని చెబుతున్నారు. విధి విధానాలు తమకు ఇంకా రాలేదని తూర్పు గోదావరి జిల్లా రిజిస్ట్రారు సత్యనారాయణ తెలిపారు.

- భూ అక్రమాలకు చెల్లు
- కలెక్టర్ చేతిలో పాశుపతాస్త్రం
- కొత్త చట్టంతో రద్దుకు అవకాశం
- 1908 నాటి చట్టానికి సవరణ
- అసెంబ్లీలో ఆమోదించిన సర్కార్
- కోర్టుకెళ్లకుండానే పరిష్కారం
- భూ బాధితులకు శుభవార్త
- కబ్జాదారులకు చేదువార్త
- నాటి అక్రమాలతో మేలుకొలుపు

ప్లాస్టిక్ నిషేధం ఉల్లంఘిస్తే ట్రేడ్ లైసెన్స్ రద్దు : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 13(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై ఉన్న నిషేధాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్, కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి తెలిపారు. ప్లాస్టిక్ నిషేధాన్ని ఇకపై నగరంలో కఠినంగా అమలు పరుస్తామన్నారు.75 మైక్రాన్స్ లోపు ఉండే ప్లాస్టిక్ కవర్లతో పాటు ప్లాస్టిక్ ప్లేట్లు,కప్పులు, ప్లాస్టిక్ గ్లాసులు,ఫోర్క్‌లు, స్ట్రాలు,స్వీట్ బాక్సులు ప్యాకింగ్‌కు వాడే పల్చటి ప్లాస్టిక్, ఇయర్ బడ్స్, బెలూన్లకు వాడే ప్లాస్టిక్ స్టిక్స్, ప్లాస్టిక్ జెండాలు, అలంకరణకువాడే థర్మాకోల్ తదితర వస్తువులపై నిషేధం ఉందన్నారు.వీటిని వినియోగిస్తే చర్యలు తప్పవన్నారు. ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి.. ప్రజల ఆరోగ్య సమస్యలకు కారణభూతమవుతుందన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే వ్యాపారుల ట్రేడ్ లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు.



సూర్యఘర్..స్లో!

- జిల్లాలో 10,867 దరఖాస్తులు
- ఫీజు చెల్లించినవి 2900
- 1723 ఇళ్లకే సోలార్
- పథకం నిర్వహణ గాలికి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఈ పథకంపై అవగాహన కల్పించకపోవడంతో పెద్దగా స్పందన కనిపించడంలేదు.జిల్లాలో సూర్యఘర్ పథకా నికి 10,867మంది దరఖాస్తు చేస్తున్నారు.కానీ ఇంత వరకూ అప్లికేషన్ ఫీజ్ కట్టినవారు 2900 మంది మాత్రమే. అందులో ఇళ్లకు సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసుకున్న వారు 1723 మంది మాత్రమే. ఇక్కడ సోలార్ సామర్థ్యం మొత్తం 1.186 మెగాగాట్లు. వీటిని వేగవంతం చేసే బాధ్యత విద్యుత్ శాఖకు ఉంది. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చొరవతీసుకుని డీఆర్‌డీఏ, మెప్మాలకు బాధ్యత అప్పగిం చా రు. ఈ శాఖల్లో గ్రామాలు, పట్టణాలకు చెందిన సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులు ఉంటాయి. వారిని మోటివేట్ చేసి వారి ఇళ్లను సూర్యఘర్లుగా మార్చడానికి ప్రయత్నించారు.ఈ గ్రూపుల్లో లక్షల మంది మహిళలు ఉంటారు.అయితే ఇంత వరకూ డీఆర్‌డీఏ నుంచి సుమారు 250 మంది, మెప్మా నుంచి సుమారు 90 మంది వరకూ ముందుకు వచ్చినట్టు చెబుతున్నారు.

ఈ పథకం పొందాలంటే...

ఈ పథకానికి అందరూ అర్హులే. డాబా మీద కనీసం 100 చదరపు అడుగుల స్థలం ఉంటే సరిపోతుంది.అక్కడ ఒక కిలోవాట్ సోలార్ ద్వారా కిలోవాట్ సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చు. దానికి రూ.70వేలు ఖర్చు అవుతుంది.అందులో రూ.30 వేలు ప్రభుత్వం భరిస్తుంది.కానీ లబ్ధిదారుడు ముందుగా రూ.70 వేలు చెల్లిస్తే తర్వాత రాయితీ రూ.30 వేలు ఇస్తుంది.అన్ని వర్గాలకు ఈ పథకం వర్తిస్తుంది. కిలోవాట్లను బట్టి చెల్లించాల్సిన సొమ్ము కొద్దిగా పెరుగుతుంది. సోలార్ ఇన్‌స్టాల్ చేయడానికి జిల్లాలో 500 మంది వెండర్లు ఉన్నారు.బీసీలు ఎవరైనా ముందుకు వచ్చిన సూర్యఘర్‌గా తమ ఇంటిని మార్చుకోవాలంటే ప్రస్తుతం ఇచ్చే రాయితీతో పాటు మరో రూ.20 వేలు రాయితీ కూడా ఇవ్వనున్నారు. ఎస్సీలకు ఇంకా రాయితీకి గురించి ప్రకటించలేదు.కానీ పూర్తిగా ఉచితంగా ఇస్తారనే ప్రచారం జరుగుతోంది.

సన్..డే!

రాజమహేంద్రవరం సిటీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): వానాకాలం వచ్చినా భానుడి ప్రతాపం మాత్రం తగ్గడంలేదు. గత వారం రోజులుగా వరుణుడు ముఖం చాటేయడంతో భానుడు మండిపడుతున్నాడు.. ఆదివారం వచ్చిందంటే రాజమహేంద్రవరం పార్కులు, పుష్కరాలరేవు, కంబాలపార్కు, జీఎన్‌టీ రోడు తదితర సెంటర్లు ప్రజలతో కళకళలాడేవి.కానీ ఈ ఆదివారం మాత్రం ఎండదెబ్బకు ఉదయం 9 గంటలకే మార్కెట్ పనులు ముగించుకుని ప్రజలు ఇళ్లల్లోకి వెళ్లిపోయారు.ఎండవేడిమికి నగరంలో గోకవరం బస్టాండ్ రోడ్డు, కోరుకొండ రోడ్డు, కంబాలచెరువు రోడ్డు, వైజంక్షన్ రోడ్డు నిర్మానుష్యంగా మారాయి. అడపాదడపా బయటకు వచ్చిన వారు మాత్రం గొడుగులు ,టోపీలు, ముసుగులు వేసుకున్నారు. నగరంలో ఆదివారం గరిష్ఠ ఉష్ణోగ్రత 37 డిగ్రీలుగా నమోదైంది. ఈ నెలలో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత. మరొక రెండురోజులు ఎండలు కాసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.



నిర్మానుష్యంగా రాజమహేంద్రవరం గోదావరి బండ్ రోడ్



గోదావరిలో శివయ్య



కాసేపటికే ఇలా..

8

హరి పాదాన పుట్టావంటే.. గోదారమ్మ

గోదావరి ఉధృతంగా ఉంది.. ఎగువ ప్రాంతాల్లో తగ్గుముఖం పట్టడంతో వరదంతా ఉరుకున పరుగున వచ్చిపడుతోంది.. గట్లను తాకుతూ.. లంకలను ముంచుతూ పరుగులు పెడుతోంది. 6.56 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. గోదావరి ఉధృతికి కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని ఈ చిత్రమే ఉదాహరణ.. మొదటి ఫొటోలో శివలింగం గోదావరిలో నానుతూ కనిపించింది.. పది నిమిషాల వ్యవధిలోనే శివయ్యను గోదారమ్మ ముంచెత్తిన దృశ్యం రెండో చిత్రంలో చూడవచ్చు.. ఆదివారం గోదావరి ఉధృతి ఇంతలా ఉంది.. మరికొంత వరద పెరిగితే గోష్పాదక్షేత్రం నీటమునుగుతుంది. ఈ ఏడాది ఇంత ఉధృతంగా రావడం ఇదే తొలిసారి.. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. అయితే సాయంత్రానికి గోదావరి తగ్గుముఖం పట్టడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు..

మన కోటావోడు.. ఇక లేడా!



నటుడు జిత్‌మోహన మిత్రతో కోట (ఫైల్)

గోదారోళ్లతో ఎంతో అనుబంధం

నాకేంటి.. నాకేంటి!.. అంటూ అహ నా పెళ్లంటలో పిసినారి క్యారెక్టర్‌లో కడుపుబ్బా నవ్వించినా.. వీడెవండి బాబూ అంటూ పవిత్ర బంధం సినిమాలో వెంకటేష్ తండ్రిగా ఆకట్టుకున్నా.. శత్రువు..గణేష్ సినిమాల్లో విలన్ పాత్రల్లో రాణించినా.. గోదారోళ్ల యాస భాషలే ఆయన నటనకు కంచుకోట.. పాత్ర ఏదైనా గోదారోళ్ల డైలాగ్‌లతో ఆకట్టుకునేవారు.. అందుకే ఒకానొక టైమ్‌లో మన కోటావోడు.. ఉన్నాడంట్రా సినిమా కెళదాం అనేస్థాయికి అభిమానుల గుండెల్లో కోట కట్టుకున్నారు.. అయితే ఆదివారం ఆయన మృతిచెందడంతో.. ఇక లేరనే చేదునిజాన్ని తట్టుకోలేక అభిమానులు కన్నీటిపర్యంతమయ్యారు.

- తొలి సినిమా ప్రాణం ఖరీదు
- కోనసీమలోనే చిత్రీకరణ
- కన్నీళ్లు పెట్టుకున్న అభిమానులు

అమలాపురం రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): క్రూరమైన విలనిజమైనా, కడుపుబ్బ నవ్విం చే హాస్యరసమైనా, కన్నీళ్లు పెట్టించే సెంటిమెంటు సీనైనా.. ఏదైనా అవలీలగా చేసేసి.. సీన్‌ను పండించగల అతి అరుదైన ఆర్టిస్టు కోట శ్రీనివాసరావు.. గోదావరి జిల్లా వాళ్లకు మాత్రం ఎప్పటికీ కోటావోడు..హాస్యాన్ని కొత్త పుంతలు తొక్కించడంతో పాటు తన సహజశైలి నటనతో, వాక్ చాతుర్యంతో చలనచిత్రసీమలో ప్రత్యేక స్థానం సాధించారు. సహజ నటుడిగా పేరొందిన కోట శ్రీనివాసరావుకు కోనసీమతో ఎంతో అనుబంధం ఉంది. 1978లో విడుదలైన ప్రాణం ఖరీదు చిత్రంలో తొలిసారిగా కోట శ్రీనివాసరావు నటించారు.ఆ చిత్రం షూటింగ్ సఖినేటిపల్లి మండలం గుడిమూల పరిసర ప్రాంతాల్లోనే జరిగింది. సినిమాల్లో నటిస్తూనే బ్యాంకు ఉద్యోగిగా కొనసాగారు. 1987లో కోటశ్రీనివాసరావు సమనసలోని స్టేట్ బ్యాంకులో పని చేశారు. నాటి గ్రామ సర్పంచ్ మామిళ్లపల్లి రాజారావు నడుపుతున్న అన్నపూర్ణ టాకీస్‌ను సందర్శించారు. టాకీస్ వద్ద శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. చిత్రమేమిటంటే ఆ సమయంలో అన్నపూర్ణ టాకీస్‌లో లేడీ సూపర్ స్టార్ విజయశాంతి నటించిన ప్రతిఘటన చిత్రం ఆడుతోంది. ఆ సినిమాలో కోట శ్రీనివాసరావు నటించారు. కోట శ్రీనివాసరావు మృతిచెందారన్న సమాచారం ఎంతో కలచివేసిందని నాటి సర్పంచ్ మామిళ్లపల్లి రాజారావు అన్నారు.

ఎన్నో మరుపురాని పాత్రలు

తర్వాత జంధ్యాల దర్శకత్వంలో వచ్చిన అహ నా పెళ్లంటలో కోట శ్రీనివాసరావు లక్ష్మీపతి అనే విలక్షణమైన పాత్రల్లో నటించారు. పిసినారి తండ్రిగా ఆయన చేసిన పాత్ర ఎంతో మెప్పించింది. గోదావరి జిల్లాలోనే ఈ చిత్ర ం షూటింగ్ జరగ్గా ఈ పాత్రలో కోడిని కట్టేసి సగం పగిలిన కళ్ల అద్దాలతో ఉత్తి అన్నం తింటూ చికెన్ తిన్నట్టుగా ఫీలయ్యే సీన్‌ను ఇప్పటికీ మీమ్స్‌లో వైరల్ చేస్తుంటారు. కోటా నటించిన మరో మరుపురాని చిత్రం వంశీ దర్శకత్వంలో వచ్చిన శ్రీ కనకమహాలక్ష్మి రికార్డింగ్ డ్యాన్స్ ట్రూప్.. ఇందులో ఏళ్ల పాపారావుగా ఆయన పండించిన హాస్యం అద్భుతం.. రాజమహేంద్రవం, కోనసీమల్లో ఈ చిత్ర షూటింగ్ జరగ్గా.. గోదావరి యాసలో కోటా పలికిన డైలాగులు మరో స్థాయిలో ఉంటాయి. జంధ్యాల దర్శకత్వంలో వచ్చిన చూపులు కలిసిన శుభవేళ చిత్రంలో గుర్నాథం పాత్ర కోటకు మరో ఆణిముత్యం లాంటిది.తెలుగు భాషను ప్రేమించే జమిందారుగా..ఆయన గ్రాంథిక భాషలో మాట్లాడుతూ పండించిన హాస్యం భలే ఉంటుంది. 'ఉత్తరపురుషుడు', 'నిశివర్లోష్టోదకము' 'ఉష్ణగ్రాహకమటం', 'అశ్వము అధిరోహించుట', 'చతుష్చక్ర శకట నివాస స్థానము' అనే పదాలు.. ఆయన నోటి వెంట ఆరోగ్యకరమైన హాస్యాన్ని పండించాయి. తర్వాత కోనసీమ పరిసరాల్లో తీసిన ఖైదీనెంబరు 786లో ఆయన సూర్యచంద్రరావు పాత్రలో మెప్పించారు. యమలీలలో ఇన్‌స్పెక్టర్ రంజిత్, హలోబ్రదర్‌లో తాడిమట్టయ్యవినోదంలో బంగారం సహా ఇంకా అనేక చిత్రాల్లో నటించి ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. 1992లో విడుదలైన భలే ఖైదీలు చిత్రం కాకినాడ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకుంది. కీలక సన్నివేశాల చిత్రీకరణలో కాకినాడలోని ప్రైవేటు బస్సులో షూటింగ్ నిర్వహించారు. ఈ చిత్రంలో అమలాపురం రూరల్ మండలం సవరప్పాలెం గ్రామానికి చెందిన సత్తి శ్రీరామప్రసాద్ ఆర్టీసీ కండక్టర్‌గా నటించారు. కోట శ్రీనివాసరావు మృతిచెందారన్న వార్త తనను ఎంతగానో కలచివేసిందని శ్రీరామప్రసాద్ నాటి షూటింగ్ సంఘటనలను గుర్తు చేసుకున్నారు.ఇక అమలాపురం ఎస్కేబీఆర్ కళాశాల అధ్యాపకుడిగా పనిచేస్తున్న ప్రముఖ రచయిత దువ్వూరి సుబ్రహ్మణ్యశర్మ పలు పర్యాయాలు కోట శ్రీనివాసరావును కలిశారు.ఆయనతో అనుబంధాన్ని సుబ్రహ్మణ్యశర్మ వివరించారు. కోట శ్రీనివాసరావు మృతికి ఎంపీ పురం దేశ్వరి సంతాపం తెలిపారు.



అనపర్తిలో 'కోట' ఎన్నికల ప్రచారం

అనపర్తి, జూలై 13(ఆంధ్రజ్యోతి): కోట శ్రీనివాసరావు మరణం తీరని లోటని బీజేపీ నాయకుడు కొవ్వూరి సత్యనారాయణరెడ్డి అన్నారు. కోటతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.1998లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి తరపున ప్రచారం చేసేందుకు అనపర్తి వచ్చిన ఆయనతో ముచ్చటించే అవకాశం కలిగిందన్నారు. అనపర్తి జీబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన బి.రత్నారెడ్డి..1966లో ఏలూరులోని సీఆర్‌రెడ్డి కళాశాలలో కోట శ్రీనివాసరావుతో కలిసి డిగ్రీ (బీఎస్సీ) పూర్తి చేశారు.

'కోటా'భిమానులు..

దేవీపట్నం/రాజమహేంద్రవరం కల్చరల్/నిడదవోలు, జూలై 13(ఆంధ్రజ్యోతి): ముద్దుల ప్రియుడు చిత్రం దేవీపట్నం ఉమాచోడేశ్వర స్వామి ఆలయంలో షూటింగ్ చేశారు. ఈ సినిమాలో కోట శ్రీనివాసరావు కొబ్బరికాయల సుబ్బయ్య పాత్రలో నటించారు. సినీనటుడు కోట శ్రీనివాసరావుతో తమకు గల అనుబంధాన్ని రాజమహేంద్రవరానికి చెందిన నటుడు, గాయకుడు జిత్‌మోహన్ మిత్ర పంచుకున్నారు. సుమారు 50 సినిమాల్లో ఆయనతో కలిసి నటించినట్టు చెప్పారు. కోట శ్రీనివాసరావుతో తాను తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం గాడాల గ్రామం, రాజమహేంద్రవరం సిటీ పరిధిలోని మోరంపూడిలో జరిగిన సినిమా షూటింగుల్లో పాల్గొన్నట్టు తెలిపారు. నిడదవోలు పరిసర ప్రాంతాల్లో 1996 సంవత్సరం తాళి సినిమా చిత్రీకరణ సమయంలో సినీనటుడు కోట శ్రీనివాసరావు నిడదవోలు పట్టణంలోని సుంకవల్లి గణేశ్వరరావు నివాసంలో విడిది చేశారు. ఆ సమయంలో గణేశ్వరరావు కుమారుడు సుంకవల్లి శ్రీధర్ వారితో ఫొటో దిగారు. ఆయన మృతితో గోదావరి జిల్లాల్లో అభిమానులు జ్ఞాపకాల నెమరు వేసుకుని కన్నీటిపర్యంతమవుతున్నారు.

వందనాలమ్మా!

ఆషాఢమాసం సందర్భంగా జిల్లాలో అమ్మవార్లకు సారె సమర్పించడం ఆనవాయితీ.. దీనిని ప్రస్తుతం కొనసాగిస్తున్నారు. వందలాది రకాలు అమ్మవారికి సారెగా తీసుకెళుతున్నారు. ఈ చిత్రంలో చూశారా.. బిక్కవోలు మండలం జువ్వలదొడ్డిలో ఉన్న సత్తెమ్మ తల్లికి ఆదివారం భక్తులు ఆషాఢమాసం సందర్భంగా సారె సమర్పించుకున్నారు. వంద రకాల స్వీట్లను అమ్మ వారికి అందజేశారు. ముందుగా భక్తులు స్వీట్లతో గ్రామోత్సవం చేశారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి సమర్పించారు. - **బిక్కవోలు**



అపూర్వ విద్యార్థుల కలయిక



1990 వ సంవత్సరంలో చదువుకున్న పదోతరగతి విద్యార్థులు

కొవ్వూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గవర్నమెంట్ హైస్కూల్‌లో 1990 వ సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం ఒక్కచోట కలుసుకున్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని సూర్య భాస్కర రామ్మోహన్ (చిన్ని) అతిథి గృహం దీనికి వేదికైంది. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఏకమై తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ముందుగా తమతో చదువుకుని ఇటీవల మరణించిన స్నేహితులు బత్తి రమేష్, యనమల చంద్రశేఖర్, ఉక్కుసూరి అచ్చెన్నకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో కంటమణి ప్రసాద్, తేలు హరికృష్ణ, పిక్కి కొండలరావు, తుమ్మలపల్లి రమేష్, బాలదారి ఉమా , వంకాయల శ్రీనివాస్, కె.సూరిబాబు, కె.మా చన్న, వి.శ్రీనివాస్, యనమదల మునీంద్ర, జీ.త్రిమూర్తిరాజు, గంగవేణి, ఆలపాటి మురళి, తదితరులు పాల్గొన్నారు.

మేదర కులస్థులను ఎస్టీల్లో చేర్చాలి



గోపాలపురంలో ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

గోపాలపురం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మేదర కులస్థులను ఎస్టీల్లో చేర్చాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జొరిగే మస్తాన్‌రావ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో తూర్పుగోదావరి జిల్లా మేదర సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల మాదిరిగా మన రాష్ట్రంలో ఉన్న మేదర సామాజిక వర్గాన్ని ఎస్టీల్లో చేర్చి ప్రభుత్వ తోడ్పాటు అందించాలన్నారు. ఈ రాష్ట్రంలో తప్ప మిగిలిన అన్ని రాష్ట్రాల్లోనూ మేదర సామాజిక వర్గ రిజర్వేషన్ ప్రాతిపాదికన ఎస్టీ జాబితాలో ఆయా ప్రభుత్వాలు చేర్చాయన్నారు. 2014-19 కాలంలో ప్రస్తుత సీఎం చంద్రబాబు చేర్చుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అనంతరం తూర్పుగోదావరి జిల్లా మేదర సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా శనగవరపు ఓం నమ శివాయ, ప్రధాన కార్యదర్శిగా కాపేల్లి నాగ ముత్యాలరావు, కోశాధికారిగా నోముల సత్యనారాయణ, ప్రచార కార్యదర్శిగా పాతకోట సూర్యప్రకాశ్‌రావుతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో రాష్ట్ర మేదర సంఘం ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, రాష్ట్ర కోశాధికారి మంగారావు, ప్రధాన కార్యదర్శి మాణిక్యాలరావు, రాష్ట్ర కన్వీనర్ ధుళిపాల ఏసుబాబు, మేదర కేతేశ్వరస్వామి, నిత్యానాదర స్తుతు గౌరవ అధ్యక్షుడు నందికంటి వెంకట హనుమాన్ ప్రసాద్, రాష్ట్ర సంఘం ఎన్నికల ప్రధాన అధికారి రంగయ్య, రాష్ట్ర సంఘం ముఖ్య సలహాదారు ఇందూరి పుల్లారావు, జేకే నాగేశ్వరరావు, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల మేదర సంక్షేమ సంఘ నాయకులు పాల్గొన్నారు.

చిట్యాలలో ఉచిత మెగా వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు


గోపాలపురం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): చిట్యాలలో గ్రామ సర్పంచ్ నూతంగి సరోజిని ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. దీనికి శ్రీసాయిస్ఫూర్తి హాస్పటల్స్ తాళ్లపూడిశాఖ మేనేజింగ్ పార్టనర్ ఎల్.సుధీర్‌కుమార్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ మెట్ట ప్రాంత ముఖద్వారమైన తాళ్లపూడి, గోపాలపురం మండలాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీంతో ప్రజలకు ఆరోగ్యశ్రీ ద్వారా అవసరమైన శస్త్ర చికిత్సలను అందించి, ఉచితంగా మందులు అందజేస్తున్నట్టు చెప్పారు. జనరల్, పిల్లలు, ఎముకలు, తదితర విభాగాలకు సంబంధించి వైద్యపరీక్షలు నిర్వహించి 300 మందికి మందులు అందజేసినట్టు తెలిపారు. జనరల్ వైద్యులు డాక్టర్ రామారావు, చిన్నపిల్లల వైద్యులు బీటీ వర్మ, ఎముకలు విభాగం వైద్యులు ఎస్‌కే వశీంరాజ అన్సారీ, కే.మౌనిక తదితర వైద్యులతో పాటు ఆసుపత్రి సీఈఓ విజయరాజు, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్, టీడీపీ రాష్ట్ర సంస్కృతిక విభాగ అధికార ప్రతినిధి నూతంగి దొరబాబు, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

15న విద్యుత్‌కు అంతరాయం

దేవరపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రామన్నపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ విద్యుత్ ఫీడర్‌లో ఆర్‌డీఎస్ పనుల నిమిత్తం మంగళవారం ఉదయం తొమ్మిదిగంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్‌సరఫరాను నిలిపి వేస్తున్నట్టు నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. నారాయణ అప్పారావు తెలిపారు. కొత్తగూడెం, సుబ్బరాయపురం విద్యుత్ వినియోగదారులకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.



కొవ్వూరులో దర్శనమిస్తున్న కొవ్వూరమ్మ



నిడదవోలు : అట్లపాడు గ్రామదేవత నంగాలమ్మ



చాగల్లు: బ్రాహ్మణగూడెం గ్రామదేవత నాగారమ్మ



నల్లజర్ల: అవపాడులో కొలువైన ముత్యాలమ్మ

శాకాంబరిగా అమ్మవారు

● మహిళలు ప్రత్యేక పూజలు

కొవ్వూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): శాకాంబరి మాతగా కొవ్వూరమ్మ ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసం సందర్భంగా గ్రామ దేవతను కూరగాయలతో అలంకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో జనాలు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది.

నిడదవోలు: అట్లపాడు గ్రామదేవత నంగాలమ్మ వారిని ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం శాకాంబరిగా అలంకరించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు పసుపు కుంకుమ, చీర, గాజులు, సారె సమర్పించారు. తమ గ్రామమంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆలయం వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

చాగల్లు: బ్రాహ్మణగూడెం గ్రామదేవత నాగారమ్మ తల్లిని శాకాంబరి దేవిగా ఆదివారం దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా పలురకాల పండ్లు, కూరగాయలతో అమ్మవారిని అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢమాసం సందర్భంగా వివిధ రకాల వంటకాలతో సారె సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

వైద్యానికి ఆర్థిక సహాయం



సాయాన్ని అందిస్తున్న మానవత సంస్థ సభ్యులు , తదితరులు

తాళ్లపూడి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): వైద్యానికి డబ్బులేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పెద్దేవం గ్రామ శివారు చిడిపిలో నివాసముంటున్న కావూరి మాణిక్యానికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తరపున రూ. ఆరు వేల ఆర్థికసాయాన్ని ఆదివారం అందించామని ఆ సంస్థ అధ్యక్షుడు వెలుగుబంటి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో సనపల రాజశేఖర్, ముణేశ్వరరావు, చంద్రయ్య మాస్టారు, ఆంజనేయులు, కవల శ్రీనివాస్, రామ్మోహన్, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం పెంచుకొనే రైతులకు ప్రోత్సాహకాలు



చాగల్లులో పశుగ్రాసం పెంపకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చాగల్లు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు పశుగ్రాసం పెంచుకోవడానికి ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు అందిస్తుందని మండల పశువైద్యాధికారి యు. ముఖేష్ తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు ఉపాధి హామీ జాబ్ కార్డు, ఆధార్ కార్డు, 1బీ, బ్యాంకు పాస్ పుస్తకం తెల్లరేషన్ కార్డు, గ్రామసభ ఆమోదంతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు పశువైద్యశాల వద్ద సంప్రదించాలన్నారు.

ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం

●సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



23వ వార్డులో మహిళలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే

కొవ్వూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఆగస్టు 15వ తేదీ నుంచి ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని 23వ వార్డులో ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలతో కలిసి ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం గత ఏడాది కాలంగా అమలుచేసిన పథకాల గురించి వివరిస్తూ, కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, మురుకొండ శ్రీనివాస్, మురుకొండ కార్తీక్ వేమగిరి వెంకట్రావు, సీహెచ్ సతీష్, బర్ల శ్రీనివాస్, పెనుమాక జయరాజు, కొప్పాక జవహర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

పేద ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే అన్నారు. ఆదివారం కొవ్వూరు పట్టణంలో ముగ్గురికి మంజూరైన రూ. 3,79,607 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి ఆదివారం అందజేశారు. ఇందులో కల్యాణి రాజ్యలక్ష్మికి రూ.2,70,000, పాకా ప్రశాంతికి రూ. 56,167, చంద్రమౌళి లక్ష్మీ గణేష్‌కుమార్‌కి రూ. 53,440 పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం హామీలను నెరవేరుస్తున్నారు

ఉండ్రాజవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నారని రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. ఆదివారం తాడిపర్రులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తారని తెలిపారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. తొలుత గ్రామంలో మహిళలు శేషారావుకు హారతి పట్టారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు పెండ్యాల గోవిందరావు శేషారావును శాలువాను కప్పి సత్కరించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, నాయకులు వాకలపూడి సత్యనారాయణ, అక్కిన గోపాలకృష్ణమూర్తి, ముళ్లపూడి పాండురంగ, ముదునూరి రవీంద్రరాజు, పాతూరి నరేంద్ర, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



తాడిపర్రులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శేషారావు

వ్యవసాయ విద్యుత్ సరఫరాలో మార్పు

నల్లజర్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): చోడవరం పరిసర గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్ సరఫరా సమయాలను మార్పు చేసినట్టు ఈఈ నారాయణ అప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపల్లి సబ్‌స్టేషన్ నుంచి తెలికిచర్ల ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండుగంటల వరకు సరఫరాను నిలిపి వేస్తున్నట్టు చెప్పారు. అలాగే .వ్యవసాయ విద్యుత్ ఉదయం మూడు గంటల నుంచి 8గంటల వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఉంటుందన్నారు. చోడవరం పరిసర ప్రాంత రైతులు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



తీవ్ర గాయాలపాలైన వ్యక్తి

కొవ్వూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కుమారదేవం గండిపోచమ్మ ఆలయం మలుపు వద్ద ఆదివారం ఎదురెదురుగా రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్నాయి. స్థానికులు అందించిన వివరాల ప్రకారం పెద్దాపురం మండలం దివిలికి చెందిన వల్లభశెట్టి వెంకటేష్ పట్టిసీమ వెళ్లి తన బైక్‌పై తిరిగివస్తున్నాడు. అదే సమయంలో తాళ్లపూడి మండలం రాగోలపల్లికి చెందిన నీరుకొండ పోసిరత్నం కొవ్వూరు నుంచి బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ఇరువురు కుమారదేవం గండిపోచమ్మ ఆలయం మలుపులో వాహనాలతో ఢీకొన్నారు. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఇరువురిని 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అత్యవసర వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరానికి రిఫర్ చేశారు.



సీజ్ చేసిన మెకనైజ్డ్ డ్రెడ్జింగ్ బోటు దొంగతనంపై కేసు

కొవ్వూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సీజ్ చేసిన మెకనైజ్డ్ డ్రెడ్జింగ్ బోటు దొంగతనంపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. కొవ్వూరు పట్టణంలో గత నెల రెండో తేదీన అఖండ గోదావరి కుడిగట్టు విభాగం ఏఈ జి.మణికంటరాజు, రెవిన్యూ, డ్రిస్టిక్ టాస్క్‌ఫోర్సు బృందంతో కలిసి ఇసుక ర్యాంపులు తనిఖీలు చేశారు. ఇందులో దండకుంట పుంత ఇసుకర్యాంపు -2లో అనధికారికంగా ఇసుకతవ్వకాలు చేస్తున్న రెండు మెకనైజ్డ్ డ్రెడ్జింగ్ బోట్లు వెరోనికా శ్రీలోహితాక్ష, పేరు తెలియని బోటును సీజ్ చేసి, పంచనామా నిర్వహించి, అధికారుల కస్టడీలో ఉంచారు. ఈనెల 11న వెరోనికా శ్రీలోహితాక్ష డ్రెడ్జింగ్ బోటు కనిపించకపోవడంతో పల్నాడు జిల్లా అమరావతి మండలం దరణికోటకు చెందిన బుడ్డి రవికుమార్, కృష్ణాజిల్లా గొల్లపూడికి చెందిన పీత వెంకట రామారాజు బోటును దొంగతనం చేశారని ఏజీఆర్‌బీ ఏఈ జి.మణికంఠరాజు పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

దొంగతనం కేసులో ముగ్గురి అరెస్టు

● వెల్లడించిన కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్

కొవ్వూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పలు కేసుల్లో నేరాలకు పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసినట్టు కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ ఆదివారం వెల్లడించారు. వివరాల్లోకి వెళ్లితే ... పట్టణంలోని సంస్కృత పాఠశాల దగ్గరలోని కూల్ డ్రింక్స్, కూరగాయల షాపులో ఈనెల 8వ తేదీ రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగులకొట్టి రూ. 3 వేల నగదు, 2.25 లీటర్ల ధమ్సప్ బాటిల్ కేసులు 9, హోమ్ థియేటర్ 1, కొన్నిసిగరెట్ ప్యాకెట్లను దొంగిలించుకుపోయినట్టు షాపు నిర్వాహకుడు తొండ్రంకి కురిమిశెట్టి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ ఆదేశాల మేరకు పట్టణ సీఐ పి.విశ్వం ఆధ్వర్యంలో రెండుప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దొంగతనానికి పాల్పడిన రాజమహేంద్రవరం నామవరం, మసీదు వద్ద ఏ.బ్లాక్‌కు చెందిన (ప్రసుత్తం కొవ్వూరు మండలం వేములూరులో నివాసముంటున్న) గుడ్ల సతీష్ అలియాస్ పకోడి, తమ్మిశెట్టి సాయి, కొంతమూరుకు చెందిన బొండపల్లి అచ్యుత్ సతీష్‌ను ఈ నెల 12వ తేదీన కొవ్వూరు నందమూరు రోడ్‌లోని బుద్దుడుబొమ్మ సెంటర్‌లో అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి సుమారు రూ. 6 లక్షల విలువైన చోరీ సొత్తు, ఇతర కేసులకు సంబంధించి 5 మోటారు సైకిళ్లు, ఒక అండ్రాయిడ్ ఫోన్, ఒక జత వెండి పట్టీలు, ఒక బంగారు నక్లెస్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. గుడ్ల సతీష్‌పై కొవ్వూరు పోలీస్‌స్టేషన్‌లో గతంలో 5 కేసులున్నాయని డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించి ప్రావీణ్యం చూపిన సీఐ పి.విశ్వం, ఎస్ఐ పి.రవీంద్రబాబు, సిబ్బంది అబ్బారీబేగ్, జీవీఎన్‌వీ అనిల్‌కుమార్, ఆర్. కోట సత్యనారాయణ, కె.జయరాం, ఎస్.గణేష్, ఎస్‌కే వలీను ఎస్పీ అభినందించారు.

కడియాలమ్మ తల్లికి ఆషాఢం సారె సమర్పణ



దేవరపల్లిలో అమ్మవారికి సారె తీసుకొస్తున్న భక్తులు

దేవరపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి గ్రామదేవత కడియాలమ్మ తల్లికి ఆషాఢం సారెను ఆదివారం భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు. ఇందులో వివిధ రకాల స్వీట్లు, పండ్లు తీసుకుని భారీ సంఖ్యలో మహిళలు గ్రామంలోని అభయాంజనేయస్వామి, వినాయకుడి ఆలయం, మెరకవీధి రామాలయం, శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయం, ఉమారామ లింగేశ్వర స్వామి ఆలయం, ఆదిశంకరాచార్య ధ్యాన మందిరం, షిర్డీ సాయిబాబా మందిరం, పల్లపు వీధి రామాలయం, అన్నిగ్రామాల్లోనూ సౌభాగ్య దుర్గాంబిక ఆలయాలను దర్శించుకుని గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కైరం అప్పారావు, కాట్రు భీమ రాజు, ఓరుగంటి లక్ష్మీపతి రాజు, కే.రామరాజు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: అవపాడు గ్రామ దేవతలైన ముత్యాలమ్మ, విజయ దుర్గమ్మ వార్లకు ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం వివిధ రకాల పిండి వంటలు, స్వీట్లు, చీరలతో సారె సమర్పించారు. పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు, లలిత సహస్ర నామ పారాయణం చేశారు. అలాగే వివిధ రకాల కూరగాయలతో అమ్మవార్లను శాకంబరిగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కోటసత్తెమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తజనం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నిడదవోలు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తిమ్మరాజుపాలెంలో వేంచేసి ఉన్న కోట సత్తెమ్మను ఆషాఢమాసం మూడో ఆదివారం సందర్భంగా అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తజనంతో ఆలయం కిటకిటలాడింది. ఉదయం సుప్రభాతసేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి క్షీర, మహా నివేదన చేశారు. భక్తుల ప్రత్యేక , ఉచిత దర్శనాలు చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 82,540 , అన్నదాన విరాళాల ద్వారా రూ. 25,667, ప్రసాద విక్రయాల ద్వారా రూ. 63,700, పూజా టికెట్లు, ఇతర టికెట్ల ద్వారా రూ. 70,374, విరాళాల ద్వారా రూ. 43,800 మొత్తం రూ. 2,86,081 ఆదాయం లభించినట్టు దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వి.హరి సూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

● రూ. 2200 నగదు స్వాధీనం ● కేసు నమోదు

గోపాలపురం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) రహస్యంగా పేకాట ఆడుతున్న శిబిరంపై ఆదివారం పోలీసులు ఆకస్మికంగా దాడి చేసినట్టు ఎస్ఐ పీ. మనోహర్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహకిశోర్ ఆదేశాల మేరకు మండల పరిధి చెరుకుమిల్లి గ్రామ శివారులో ఉన్న పామాయిల్ తోటలో పేకాట నిర్వహిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు తన సిబ్బందితో దాడి చేయగా, నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. అలాగే వారి వద్ద నుంచి రూ. 2200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.



అదుపులో తీసుకున్న వ్యక్తులతో ఎస్ఐ మనోహర్

ఎంపీ పురందేశ్వరి సంతాపం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సినీ హాస్యనటుడు కోట శ్రీనివాసరావు మృతికి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తీవ్ర సంతాపం తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ సినిమా పరిశ్రమ గర్వించదగ్గ విలక్షణ నటుడుని కోల్పోయిందన్నారు. నాలుగు దశాబ్దాలకు పైగా దాదాపు 750 చిత్రాల్లో విభిన్న తరహా పాత్రలు పోషించి, తెలుగు చిత్రసీమలో చెరగని ముద్ర వేశారన్నారు. ఆయన మరణం సినీ ప్రపంచానికి తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నానన్నారు.

గోదావరి ఉధృతి తగ్గుముఖం

●అత్యధికంగా 6,56,341 క్యూసెక్కులు సముద్రంలోకి

● తగ్గుముఖం పడుతున్న నీటిమట్టం



ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల నుంచి దిగువకు ప్రవహిస్తున్న వరద నీరు

ధవళేశ్వరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో ధవళేశ్వరం వద్ద పెరుగుతూ ప్రవహించిన గోదావరి ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిలకడగా కొనసాగి ఆపై తగ్గుముఖం పట్టింది. ఉదయానికి అత్యధికంగా 6,56,341 క్యూసెక్కులు కాటన్ బ్యారేజ్ గేట్ల ద్వారా దిగువకు ప్రవహించింది. ఈ సమయంలో ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదయింది. మధ్యాహ్నం వరకు నిలకడగా కొనసాగిన ప్రవాహం ఆపై తగ్గుముఖం పట్టి సాయంత్రానికి 40వేల క్యూసెక్కులకు పైగా తగ్గి 6,14,762 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. ఎగువున భద్రాచలం వద్ద 24 గంటల వ్యవధిలో 10 అడుగుల మేర తగ్గిన నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి 30.60 అడుగులకు చేరుకుంది. కాటన్ బ్యారేజ్ నుంచి వ్యవసాయ అవసరాల కోసం తూర్పుడెల్టాకు 4,800 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2600 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 6800 క్యూసెక్కులు చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

● గోష్పాదక్షేత్రంలో శివలింగాలను ముంచెత్తిన వరద

కొవ్వూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఎగువ రాష్ట్రాల్లో కురిసిన వర్షాలకు కొవ్వూరులో అఖండ గోదావరి నది ఉప్పొంగి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువన భద్రాచలం వద్ద 41.3 అడుగులకు చేరుకుని తగ్గుముఖం పట్టడంతో దిగువన కొవ్వూరు పరిసర ప్రాంతాలలో గోదావరి నదీ నీటిమట్టం పెరుగుతోంది. దీంతో గోష్పాదక్షేత్రంలో స్నానఘట్టాల్లో ఏర్పాటుచేసిన శివలింగాలను వరద ముంచెత్తింది. ఎగువన కురిసిన వర్షాలకు గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని ఉప నదులు, వాగులు, శబరి, కిన్నెరసాని పొంగి ప్రవహించడంతో గోదావరి నదికి వరద పోటెత్తింది. గోష్పాదక్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టాలు నీటమునిగాయి. శివలింగాలను తాకుతూ వరద ప్రవహిస్తోంది. అయితే స్నానఘట్టాల్లో యథేచ్ఛగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు.

ఏదైనా ప్రమాదం జరగక ముందే అధికార యంత్రాంగం స్పందించి, చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



గోష్పాదక్షేత్రంలో ప్రధాన స్నానఘట్టంలో శివలింగాన్ని అభిషేకిస్తూ ప్రవహిస్తున్న వరద